


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 10.08.2025 | సంపుటి : 2 | సంచిక :188 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Sunday | 10.08.2025 | volume : 2 | Issue : 188 | Pages : 8 | Cost : 2/- |

## ప్రధాని మోదీకి రాఖీ కట్టిన చిన్నారులు

ప్రధాని నరేంద్రమోదీ రక్షా బంధన్ వేడుకలను విద్యార్థులు, ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి సభ్యులతో కలిసి జరుపుకొన్నారు. దిల్లీలోని ప్రధాని నివాసంలో శనివారం ఉదయం 7 గంటల సమయంలో పలువురు విద్యార్థులు, బ్రహ్మకుమారి సభ్యులు మోదీకి రాఖీ కట్టారు. అనంతరం మోదీ వారితో కొంతసేపు సరదాగా ముచ్చటించారు. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గతేడాది కూడా ప్రధాని ఇలాగే స్కూల్ విద్యార్థినులతో రాఖీ కట్టించుకున్న సంగతి తెలిసిందే. అంతకుముందు రాఖీ పండుగను పురస్కరించుకొని దేశ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. "సోదర సోదరీమణుల మధ్య అపరిమిత ప్రేమకు ప్రతీక ఈ రక్షా బంధన్. ఈ పండుగ మీ బంధాలను మరింత తీపికరంగా చేయాలని, ఆప్యాయత, సామరస్య భావాలను బలోపేతం చేయాలని, ప్రజంతా ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా" అంటూ మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.





జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో సందడి నెలకొంది. మంత్రులు సీతక్క, కొండా సురేఖ సీఎంకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు



భారాస అధినేత కేసీఆర్ ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో రక్షా బంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. అక్కలు, చెల్లెలు వినోదమ్మ రాఖీ కట్టారు.

## ఎన్టీపీసీ ప్రతిపాదనకు ప్రభుత్వం సుముఖత..!

- సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటు
- రూ.80,000 కోట్ల పెట్టుబడులకు ఆసక్తి
- సీఎం రేవంత్ రెడ్డితో ఎన్టీపీసీ చైర్మన్ భేటీ



హైదరాబాద్, ఆగస్టు 9 : తెలంగాణకు ఇదో శుభకర దినంగా చెప్పాలి. పునరుత్పాదక ఇంధన రంగంపై దృష్టి సారించిన జాతీయ శక్తి రంగంలో అగ్రగామి ఎన్టీపీసీ.. రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు సన్నద్ధమైంది. సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గురుదీప్ సింగ్ నాయకత్వంలోని ప్రతినిధుల బృందం.. జూబ్లీహిల్స్‌లోని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితో ఆయన నివాసంలో సమావేశమయ్యారు. తమ భవిష్యత్ ప్రణాళికలను వివరించింది. రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులపై దాదాపు రూ.80,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఎన్టీపీసీ వెల్లడించింది. ముఖ్యంగా ఫ్లోటింగ్ సోలార్.. నీటి మీద తేలియాడే సౌర విద్యుత్ ప్లాంట్ల ద్వారా తెలంగాణలో సుమారు 6,700 మెగావాట్ల ఉత్పత్తి సాధ్యమని సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రానికి శక్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా.. పర్యావరణ పరిరక్షణతో ఉపాధి అవకాశాల సృష్టించడం.. భూమి వినియోగం లేకుండా విద్యుత్ ఉత్పత్తి వంటి అనేక లాభాలను అందిస్తాయని ముఖ్యమంత్రికి ఎన్టీపీసీ ప్రతినిధులు వివరించారు. రాష్ట్రంలోని పెద్ద రిజర్వాయర్లు, జలాశయాలు ఈ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులకు అనువైన వనరులుగా మారనున్నాయని నిపుణులు భావిస్తున్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంలో థర్మల్, జల విద్యుత్ ఉత్పత్తిపై ఆధారపడుతున్న తెలంగాణకు, ఈ పునరుత్పాదక ఇంధన పెట్టుబడులు కీలక మలుపు అవుతాయని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ ప్రతిపాదనకు ప్రభుత్వం అన్ని విధాలా మద్దతు ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు.





# ట్రంప్ సుంకాల పేకమేడ కూలిపోతుంది

### అమెరికా ఆర్థికవేత్త కీలక వ్యాఖ్యలు

### ఓపిక పట్టండి అంటూ భారత్‌కు సలహా


న్యూఢిల్లీ, ఆగస్ట్ 9 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పేరుతో భారత్?పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. దానిపై సొంత దేశంలోనే ట్రంప్?కు వ్యతిరేకత ఎదురవుతోంది. పలువురు రాజకీయ నాయకులు, ఆర్థికవేత్తలు ట్రంప్ టారిఫ్? వార్?ను ఖండిస్తున్నారు. ఇప్పుడు ఆర్థికవేత్త, జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ స్టీవ్ హాంకీ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారు. భారత్?పై ట్రంప్? సుంకాల అంశంపై మాట్లాడారు. సుంకాలపై ట్రంప్ నిర్ణయాలు పూర్తిగా అర్థరహితమని ఓ జాతీయ మీడియా సంస్థతో స్టీవ్ హాంకీ వ్యాఖ్యానించారు. తనను తాను నాశనం చేసుకునే శత్రువు జోలికి వెళ్లకపోవడమే మంచిదని అప్పట్లో నెపోలియన్ చెప్పారని అన్నారు. ఇప్పుడు ట్రంప్ కూడా ప్రపంచదేశాలతో వాణిజ్య యుద్ధాలు చేస్తూ తనను తానే నాశనం చేసుకుంటున్నారని అనిపిస్తోందని స్టీవ్ హాంకీ తెలిపారు.

02



**త్వరలో ట్రంప్-పుతిన్ భేటీ**
స్వాగతించిన భారత్

06



06

**భారత విమానాలకు గగనతలం మూసివేత**
పాక్‌కు రూ.126 కోట్ల నష్టం



06

**భారత రక్షణ రంగ ఉత్పత్తులు @1.51లక్షల కోట్లు**
రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**ఆపరేషన్ సిందూర్‌లో ఐదు జెట్లను కూల్చేశాం**
ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్

03



03

**బహుశా రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంటా**
మాజీ మంత్రి మల్లారెడ్డి



03

**నిరుద్యోగులకు గుడ్‌న్యూస్**
ఆర్టీసీలో నోటిఫికేషన్

## రాజ్యాంగం మార్చాలన్న కుట్రలో బీజేపీ

- క్విట్ బీజేపీ నినాదంతో ముందుకు వెళ్లాల్సిందే..
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ప్రకారం, బీజేపీ చర్యలు అన్ని ఈ కుట్రలో భాగం గానే జరుగుతున్నాయి. శనివారం గాంధీభవన్లో "క్విట్ ఇండియా" దినోత్సవం నిర్వహించారు.

03



**నా వ్యాఖ్యలు వెనక్కు తీసుకోను**

- ఫోన్ ట్యాపింగ్‌లో తండ్రీకొడుకుల హస్తం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

03

## ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్

- రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం
- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- జిల్లాల కలెక్టర్లతో భట్టి విక్రమార్క సమీక్ష
- ఖాళీ స్థలాలను గుర్తించాలని ఆదేశం



హైదరాబాద్, ఆగస్టు 9 : సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గ్రామ పంచాయతీల నుంచి సెక్రటేరియట్ వరకు అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో శనివారం నాడు ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో భట్టి విక్రమార్క సమీక్షించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫారుకి, రెడ్కో సిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు.

02



# సొంతూళ్లకు నగరవాసులు

- హైదరాబాద్-విజయవాడ ట్రాఫిక్ మాయం
- జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో వాహనాలు
- కిలోమీటర్ల మేరా బారులు తీరిన వాహనాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

**హైదరాబాద్, ఆగస్టు 9 :** రాఖీ పౌర్ణమి పండగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకు నేందుకు నగరవాసులు పెద్ద సంఖ్యలో సొంతూళ్లకు బయలుదేరడంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. పండగ రద్దీ కారణంగా శనివారం ఉదయం నుంచే రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ నగర శివార్లలోని వనస్థలిపురం, భాగ్యలత, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఒక్కసారిగా వేల సంఖ్యలో వాహనాలు రోడ్లపైకి రావడంతో ప్రధాన రహదారితో పాటు సర్వీసు రోడ్డు కూడా వాహనాలతో నిండిపోయాయి. కిలోమీటర్ల కొద్దీ వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. మరోవైపు, ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద కూడా ఇదే తరహా పరిస్థితి నెలకొంది. పండగ రద్దీ కారణంగా ఇక్కడ ట్రాఫిక్ దాదాపుగా స్తంభించిపోవడంతో, వాహనాలు ముందుకు కదలలేని దుస్థితి ఏర్పడింది. ఈ ఊహించని ట్రాఫిక్ జామ్ వల్ల గంటల తరబడి ప్రయాణం సాగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. తమ గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్

- రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం
- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- జిల్లాల కలెక్టర్లతో భట్టి విక్రమార్క సమీక్ష
- ఖాళీ స్థలాలను గుర్తించాలని ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 9 :** సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గ్రామ పంచాయతీల నుంచి సెక్రటేరియట్ వరకు అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తామ న్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో శనివారం నాడు ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో భట్టి విక్రమార్క సమీక్షించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫారుకి, రెడ్కో సిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు. అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్ కు పంపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ లో ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుంచి పంపిస్తామని చెప్పారు. కలెక్టరేట్లలో ఏమైనా మంచి డిజైన్లు ఉంటే కనుక వాటిని హైదరాబాద్ కు పంపాలని ఈ సందర్భంగా కలెక్టర్లకు ఆయన సూచించారు. గ్రామపంచాయతీ మొదలుకొని సెక్రెటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేస్తామన్నారు. వాటి ద్వారా పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపించారు. అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆఫీసుకి పంపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై తెలంగాణ ప్రభుత్వం సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లను భట్టి విక్రమార్క ఆదేశించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఖాళీ స్థలాలు ఉ న్నాయని, వాటి వివరాలు సైతం పంపాలని కలెక్టర్లకు సూచించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ ఓ ఎఫ్ ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను పంపిణీ చేసింది. ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్లకు భట్టి విక్రమార్క వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించాం. ఈ ఆగస్టు నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కనుక కలెక్టర్లు దీనిపై సత్వరం స్పందించి వారంలోగా వివరాలు పంపండి, ఈ విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలు, ని సంప్రదించాలని' కలెక్టర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

# రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం

- ఇరు దేశాల భూభాగాల మార్పిడి ఉంటుంది
- శాంతి ఒప్పందం కుదురుతుందనే ఆశిస్తున్నా
- డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 9 :** మూడున్నరేళ్లు గడిచినా రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడలేదు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ తో భేటీ అయ్యేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ట్రంప్ ఒక ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. రష్యా–ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందంలో భూభాగాల మార్పిడి కూడా ఉంటుందని చెప్పారు. తన 'ట్రూత్ సోషల్' ఖాతా ద్వారా ట్రంప్ స్పందిస్తూ... రష్యా–ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం కుదురుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంలో భాగంగా కొన్ని భూభాగాలు వెనక్కి తీసుకోవడం, కొన్ని భూభాగాలు మార్చుకోవడం జరుగుతుందని చెప్పారు. అయితే, ఏయే భూభాగాలు అనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. వాస్తవానికి ఈనెల 15న అలస్కా వేదికగా పుతిన్ తో భేటీ కానున్నట్టు ట్రంప్ తొలుత ప్రకటించారు. అయితే, దీనిపై రష్యా నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో, తొలుత పుతిన్ తో ద్వైపాక్షిక భేటీ జరిపి కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పించాలని ట్రంప్ భావిస్తున్నట్టు సమాచారం.

# ట్రంప్ సుంకాల పేకమేడ కూలిపోతుంది

- అమెరికా ఆర్థికవేత్త కీలక వ్యాఖ్యలు
- ఓపిక పట్టండి అంటూ భారత్‌కు సలహా

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 9 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పేరుతో భారత్?పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. దానిపై సొంత దేశంలోనే ట్రంప్?కు వ్యతిరేకత ఎదురవుతోంది. పలువురు రాజకీయ నాయకులు, ఆర్థికవేత్తలు ట్రంప్ టారిఫ్? వార్?ను ఖండిస్తున్నారు. ఇప్పుడు ఆర్థికవేత్త, జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ స్టీవ్ హాంకీ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారు. భారత్?పై ట్రంప్? సుంకాల అంశంపై మాట్లాడారు. సుంకాలపై ట్రంప్ నిర్ణయాలు పూర్తిగా అర్థరహితమని ఓ జాతీయ మీడియా సంస్థతో స్టీవ్ హాంకీ వ్యాఖ్యానించారు. తనను తాను నాశనం చేసుకునే శత్రువు జోలికి వెళ్లకపోవడమే మంచిదని అప్పట్లో నెపోలియన్ చెప్పారని అన్నారు. ఇప్పుడు ట్రంప్ కూడా ప్రపంచదేశాలతో వాణిజ్య యుద్ధాలు చేస్తూ తనను తానే నాశనం చేసుకుంటున్నారని అనిపిస్తోందని స్టీవ్ హాంకీ తెలిపారు. టారిఫ్‌లపై ట్రంప్ విధానాలు చాలా చెత్తగా ఉన్నాయని విమర్శించారు. సుంకాల అంటూ ట్రంప్ కడుతున్న పేక మేడ త్వరలోనే కూలిపోతుందని ఆయన దుయ్యబట్టారు. అప్పటివరకు భారత్, ట్రంప్ జోలికి వెళ్లకపోవడమే మంచిదని సూచించారు. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ కొంతకాలం ఓపిక పట్టి ఎదురుచూడాలని తెలిపారు. అమెరికన్ల వినిమయ ఖర్చులు పెరిగితే ద్రవ్యలోటు ఎక్కువవుతుందని అంచనా వేశారు. దీనివల్ల అమెరికా ఆర్థికవ్యవస్థకే నష్టం చేకూరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే భారత్?పై ట్రంప్ సుంకాల మోత మోగిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందనే కారణంలో తొలుత 25 శాతం టారిఫ్స్ విధించారు. అవి ఇటీవల అమల్లోకి కూడా వచ్చాయి. అంతకుముందు రోజే సుంకాలను మరో 25 శాతం పెంచారు. దీంతో 50 శాతానికి చేరాయి. రెండో పెంచిన సుంకాలు మరికొద్ది రోజుల్లో అమల్లోకి రానున్నాయి. ఇవి కాకుండా భవిష్యత్తులో మరింతగా విధిస్తామని తెలిపారు. సుంకాల విషయం తేలే వరకు న్యూదిల్లీతో వాణిజ్య చర్చలు కూడా జరపబోమని తేల్చిచెప్పారు. దీంతో రెండు దేశాల మధ్య విబేధాలు వచ్చాయి. ట్రంప్ సుంకాలను భారత్ తీవ్రంగా ఖండించింది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఎవరికీ తలవంచమని తేల్చి చెప్పింది. "భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల నిర్ణయం పూర్తిగా అర్థరహితం ఎక్కడో విషయం ఏంటంటే.. "తనను తాను నాశనం చేసుకునే శత్రువు జోలికి వెళ్ళకపోవడం మంచిదే"ననేది నెపోలియన్ చెప్పిన మాట. ఇప్పుడు ట్రంప్ తో ప్రపంచ దేశాలకు ఇదే వర్తిస్తుంది. ప్రపంచ దేశాలతో వాణిజ్య యుద్ధం చేస్తున్న ట్రంప్ తనని తానే నాశనం చేసుకుని సమయం వస్తుందని అనిపిస్తుంది. భారతదేశ విషయానికి వస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, విదేశాంగ మంత్రి జైశంకర్ కొంతకాలం ఓపికతో ఉంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ను కదిలించకపోవడం మంచిది. ఎందుకంటే ట్రంప్ కట్టే టారిఫ్ పేక మేడ త్వరలోనే కుప్పకూలుతుంది" అని ప్రొఫెసర్ అభిప్రాయపడ్డారు.

## పరమ చెత్తగా ట్రంప్ టారీఫ్ విధానాలు

ఇతర దేశాల దిగుమతులపై సుంకాలు అధికంగా పెంచుతున్న నేపథ్యంలో అమెరికాను తమ వినిమయ ఖర్చులు పెరిగితే ద్రవ్యలోటు ఎక్కువవుతుందని హాంకీ అంచనా వేశారు. డోనాల్డ్ ట్రంప్ టారీఫ్ విధానాలు పరమ చెత్తగా ఉన్నాయని ఆయన దుయ్యబట్టారు. దీనివల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు నష్టం వచ్చే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రష్యాతో భారత్ వాణిజ్యం పెట్టుకుందని కారణంతో మన దేశంపై డోనాల్డ్ ట్రంప్ అధిక సంఖ్యలను విధించిన విషయం తెలిసిందే. ఇటీవలే 25 శాతం సుంకాలను విధించిన ట్రంప్ ఇప్పుడు మరో 25 శాతాన్ని అదనంగా టారిఫ్‌లు పెంచుతూ మొత్తంగా 50% విధించిన విషయం తెలి సిందే. అయితే ఈ సుంకాల విషయం తేలే వరకు ఢిల్లీ తో అనగా మోడీ ప్రభుత్వంతో ఎలాంటి చర్చలు జరిపేది లేదని ట్రంప్ స్పష్టం చేశారు. దీంతో ఇరుదేశాల మధ్య విభేదాలు ఏర్పడినట్లు అయ్యింది. అయితే ఇప్పటికే ట్రంప్ నిర్ణయాన్ని ఖండిస్తున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. ఇది అన్యాయం, అసమంజసమైనదని పేర్కొంది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఎంత దూరమైనా వెళ్తామంటూ స్పష్టం చేసింది.

# ఏఐసీసీ ఆదేశాల మేరకే జనహిత పాదయాత్ర

- పాదయాత్రకు భారీ స్పందన
- బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్




**హైదరాబాద్, ఆగస్ట్ 9 :** ఏఐసీసీ ఆదేశాల మేరకే జనహిత పాదయాత్ర నిర్వహిస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ పాదయాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. ప్రజలు స్వయంగా వచ్చి కలుస్తున్నారని తెలిపారు. గాంధీ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మాట్లాడారు. ప్రతినెల కొన్ని నియోజకవర్గాల్లో జనహిత పాదయాత్ర నిర్వహిస్తానని, ఈ నెల చివరి వారంలో రెండో దశ ప్రారంభమవుతుందని వెల్లడించారు. అనివార్య కారణాల వల్ల ఖర్గే, రాహుల్ గాంధీ ఢిల్లీ ధర్నాకు హాజరుకాలేకపోయారని తెలిపారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై ఏఐసీసీ పరిశీలన చేస్తున్నదని చెప్పారు. కొండా మురళి వ్యవహారం త్వరలో పరిష్కారం కానుందని అన్నారు. అనిరుధ్ రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసి, వివరణ తీసుకున్నామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. బీసీల కోరిక న్యాయబద్ధమైనదని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు నిఖార్సైన విమర్శలు కాకుండా, విమర్శల కోసం విమర్శలు చేస్తున్నాయన్నారు. బీజేపీ మిత్రపక్షాలపై 3.5 శాతం మాత్రమే ఈడీ కేసులు ఉన్నాయని, మిగతా 96.5 శాతం విపక్షాలపై కేసులేనని విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీ వశంలో ఉందని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం అవినీతి, అక్రమాలపై నియమావళి ప్రకారం ముందుకు సాగుతోందని చెప్పారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ అంశాలపై సమగ్రంగా చర్చించి ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. బండి సంజయ్ ఆరోపణలు అర్థరహితమని ఖండించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ నేతలు వితండవాదం చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ శిఖండి పాత్ర పోషిస్తోందని మండిపడ్డారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో ధర్నాలో బీఆర్ఎస్ ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. పాల్గొనకపోగా అవహేళన చేయడం తగదని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. బీసీ జనాభా లెక్కల కోసం కులగణన చేపట్టినట్లు తెలిపారు. దాని ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. రాహుల్ గాంధీ మార్గదర్శనంలో బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నామని చెప్పారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రెండు బిల్లులు తీసుకొచ్చినట్లు తెలిపారు. రిజర్వేషన్లు 50 శాతాన్ని మించకూడదని ఉన్న చట్టాన్ని అధిగమించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చామని పేర్కొన్నారు. నాలుగు నెలలు గడుస్తున్నా బిల్లులు రాష్ట్రపతి ఆమోదం పొందలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించిన తరువాతే ఆ బిల్లులను ఢిల్లీకి పంపినట్టు చెప్పారు. కులగణన మోడల్‌ను రాహుల్ గాంధీ, ఖర్గే ప్రశంసించారని తెలిపారు. ధర్నాకు రాహుల్, ఖర్గే రాకపోవడంపై గల్లీ నేతల లాగా కిషన్ రెడ్డి మాట్లాడటం సరికాదని వ్యాఖ్యానించారు.



# శ్రీవారి ఆలయంలో వైభవంగా ఉపాకర్మ సేవ

**తిరుమల, ఆగస్ట్ 9 :** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నిత్యం ఏదో ఒకటి కైంకర్యం జరుగుతుంది. శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీవారి ఆలయంలో స్వామి వారికి ఉపాకర్మ సేవ వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు స్వామివారికి శ్రీ భూవరహస్వామివారి ఆలయంలో సంప్రదాయంగా యజ్ఞోపవీతాన్ని మార్చారు. శ్రీకృష్ణస్వామివారిని.. శ్రీ భూవరహస్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అర్చక స్వాముల వారు కలియుగ దేవుడు..తిరుమల శ్రీవెంటేశ్వరస్వామికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యజ్ఞోపవీతాన్ని సమర్పించి .. హారతి ఇచ్చి.. ఆస్థానం నిర్వహించి మరల ఊరేగింపుగా గోవింద నామ స్మరణతో శ్రీ కృష్ణ స్వామి వారిని తిరిగి ఆలయానికి చేరుకుంటూ .. భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పారుపత్తేదార్ హిమంతగిరి, అర్చకులు, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు హైదరాబాద్ అస్తవ్యస్తం

- చెరువులను తలపిస్తున్న రహదారులు
- నిండుకుండలా హిమాయత్‌సాగర్
- 5 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల
- తెలంగాణకు ఐఎండీ బిగ్ అలర్ట్..
- మరో 4 రోజులు భారీ వర్షాలు

**హైదరాబాద్, ఆగస్టు 9 :** కనీవినీ ఎరగని వర్షం. ఈ మధ్యకాలంలో ఇలాంటి వర్షాన్ని మేము చూడలేదని ప్రజలు చెబుతున్నారు. దాదాపు సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన వర్షం... ఆ తర్వాత తీవ్ర రూపం దాల్చింది. కేవలం రెండు గంటల్లో నగర వ్యాప్తంగా సగటున 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. దీంతో ఉద్యోగాలు, ఇతరత్రా పనులపై బయటకు వెళ్లినవారికి మొన్నటి రాత్రి కాళ రాత్రి అనే చెప్పాలి. రోడ్డుపై ప్రయాణించిన వారికి పట్టపగలే చుక్కలు కనిపించాయి. గత రెండు మూడేళ్లలో ఈ రేంజ్ వర్షం పడలేదని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ లో క్లౌడ్ బరస్ట్ కావడంతో ఒక్కసారి వర్షం పడింది. ఇక రాజధానిలో నాలాల కెపాసిటీ 2 సెంటిమీటర్ల వర్షం వరకు తట్టుకునేలా ఉన్నాయి. ఇప్పటికీ వాటిని ఎక్స్ పాండ్ చేయలేదు. ఒక మొన్న గురువారం ఒక్కసారిగా అది కూడా కేవలం రెండు గంటల వ్యవధిలో 10 సెం.మీ వర్షపాతం నమోదు కావడంతో రోడ్లన్ని నదులను తలపించాయి. ముఖ్యంగా ఆమీర్ పేట మెట్రో కింద బస్సులు మునిగిపోయేంత నీళ్లు చేరాయి. ఒక్క ఆమీర్ పేట మాత్రమే కాదు.. యూసుఫ్ గూడ, జూబ్లీహిల్స్, మలక్ పేట, కందికల్ గేట్, రాజన్నబావి, హైటెక్ సిటీ, ఛత్రినాక, అంబర్ పేట, గాంధీ నగర్, సికింద్రాబాద్ సహా పలు ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. ఇక బయటకు వాహనాలపై వెళ్లిన టూ వీలర్స్ వాళ్లకు చుక్కలు కనిపించాయనే చెప్పాలి. చాలా మంది బండ్ల సైలెన్సర్ లోకి నీళ్లు చేరడంతో బండి ముందుకు పోలేని పరిస్థితులు నెలకున్నాయి. దీంతో కొంత మంది బండ్లను అక్కడే ఒదలేసి ఆటోలను, క్యాబ్ లను ఆశ్రయించి బతుకుజీవుడా అంటూ ఇంటికి చేరారు. సాధారణ రోజుల్లో ఇంటికి చేరుకోవడానికి పట్టే సమయం కన్నా.. మూడు నాలుగు గంటలు సమయం ఎక్కువే పట్టింది. నిన్న కూడా హైదరాబాద్ లో సరూర్ నగర్ లోని విరాట్ నగర్ లో దాదాపు 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. అటు సంతోష్ నగర్ లోని ఖలేందర్ నగర్ లో 6.3 సె.మీ వర్షపాతం నమోదు అయింది. ఎల్బీ నగర్, చాంద్రాయణ గుట్ట, కందికల్ గేట్, ఉప్పుగూడ, బేగం బజార్ ప్రాంతాల్లో 3 సెంటీమీటర్ల నుంచి 4.5 సెం.మీ వర్షపాతం నమోదు అయింది. ఇక రాబోయే 4 రోజుల్లో ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడబోతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్ లో భారీ వర్షాలు కురునున్నాయి. వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టి సారించింది. వరద సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అటు కృష్ణ నగర్ వరద ప్రభావిత ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు మంత్రులు. యూసుఫ్ గూడా సర్కిల్ లోనీ కృష్ణా నగర్ లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి. భారీ వర్షం వచ్చినప్పుడు తమ ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని మంత్రుల దృష్టికి తీసుకొచ్చిన స్థానికులు. ఓ బాధితుడు మంత్రి వివేక్ కాళ్ళు పట్టుకుని తమను ఆదుకోవాలని ప్రాధేయపడ్డాడు. నాలాలు పునః నిర్మాణం ,అభివృద్ధి పనులు, డ్రైనేజీ లో సిల్ట్ తొలగింపు పనులు పూర్తి చేయడానికి అనుమతులు వచ్చాయని స్థానికులకు తెలిపారు మంత్రులు.

# ఇండియా ఎవరి ముందూ తలవంచదు

## కేంద్రమంత్రి పీయూశ్ గోయల్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 9 :** సుంకాల పేరుతో లొంగదీసుకోవాలనుకుం టున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలను భారత్ సమర్థంగా తిప్పికొడుతోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ఇప్పటికే 50 శాతం టారిఫ్స్ ట్రంప్ విధించగా, ఎవరి దగ్గర దిగుమతి చేసుకోవాలో అమెరికా నిర్దేశించలేదని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఇప్పుడు ఇండియా ఎవరి ముందు తలవంచదని తేల్చిచెప్పింది. ట్రంప్?కు మరోసారి పరోక్షంగా గట్టి సమాధానం పంపింది! ఈ మేరకు ఇటీవల జరిగిన బిజినెస్ టుడే ఇండియాఏ100 సమ్మిట్‌లో పాల్గొన్న కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్, ఇండియా ఎవరి ముందు తలవంచదని వ్యాఖ్యానించారు. ప్రపంచ వాణిజ్య సమూహాలతో భారత్ భవిష్యత్తు సంబంధాలు చాలా బలంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నాయని తెలిపారు. ఏటా ఆరున్నర శాతం వృద్ధి చెందుతుందని, మరింత వేగవంతంగా వృద్ధి చెందడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.గత సంవత్సరం కంటే ఈ ఏడాది భారత్ ఎక్కువ ఎగుమతులు చేస్తుందనే నమ్మకం ఉందని తెలిపారు. వాణిజ్య అడ్డంకులను ఎదుర్కోవడానికి ఇప్పటికే చర్యలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నాలుగు దేశాల (యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసి యేషన్) కూటమితో జరిగిన చర్చలను ṅ , భారత్?ది నాలుగు ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ మనదేనని తెలిపారు. భారత్?లో యువ శక్తి ఉందని అన్నారు. దేశాలు భారత్‌లో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడానికి అంగీకరించాయని కేంద్రమంత్రి వెల్లడించారు. దీని ద్వారా 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు, మొత్తం 50 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని తెలిపారు. అక్టోబర్ 1 నుంచి ఒప్పందం అమలు లోకి రానుందని ప్రకటించారు. అక్కడ నుంచి నాలుగు దేశాల మధ్య వాణిజ్యం మరింత సులువుగా మారుతుందని తెలిపారు. దేశాల టారిఫ్స్, సాంక్షన్స్ కారణంగా వాణిజ్యంలో డీ గ్లోబలైజే షన్ అవుతోందని వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ఇండియా ఎగుమతులు, దిగుమతులపై ఎవరూ ప్రభావం చూపలేరని తెలిపారు. భారత్ ఎవరి ముందు తలవొంచదని స్పష్టం చేశారు. దేశ కరెన్సీ, విదేశీ మారక నిల్వలు, స్టాక్ మార్కెట్లు బలంగా ఉన్నాయని తెలిపారు. సవాళ్ల సమయాల్లో భారత్ ఎల్లప్పుడూ విజయం సాధిస్తుందని అన్నారు.




# 334 రాజకీయ పార్టీల గుర్తింపు రద్దు

## బీహార్ ఓట్ల రివిజన్‌ను సమర్థించుకున్న ఈసీ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 9 :** దేశంలో రాజకీయ పార్టీల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం సవరించింది. గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించింది. నిబంధనల ప్రకారం.. ఈసీ వద్ద నమోదైన రాజకీయ పార్టీలు ఆరేళ్లలో కనీసం ఒక్క ఎన్నికలోనైనా పోటీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పార్టీలు 2019 నుంచి ఒక్క ఎన్నికలోనూ బరిలోకి దిగకపోవడంతో వాటిపై ఈసీ వేటు–వేసింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 334 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు–ఎన్నికల సంఘం తెలిపింది. పేరుకు పార్టీలు పెట్టినప్పటికీ.. వీటికి భౌతికంగా ఎలాంటి కార్యాలయాలు అందుబాటులో లేవని వెల్లడించింది. ఇప్పటివరకు దేశంలో 2,854 గుర్తింపుపొందని పార్టీలు ఈసీ వద్ద రిజిస్టర్ అయి ఉన్నాయి. తాజా చర్యతో ఆ సంఖ్య 2,520కి తగ్గింది. ఎన్నికల సంఘం వద్ద ఉన్న డేటా ప్రకారం.. ప్రస్తుతం దేశంలో ఆరు జాతీయ పార్టీలుగా కొనసాగుతున్నాయి. 67 ప్రాంతీయ రాజకీయ పార్టీలు మనుగడలో ఉన్నాయి. ఇదిలావుంటే బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు అధికారి పార్టీకి మద్దతుగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని.. 65 లక్షల ఓట్లను తొలగించిందంటూ విపక్ష పార్టీలు ఆరోపించాయి. పార్లమెంట్ వేదికగా ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలు చేపట్టాయి. అంతేకాకుండా ఇటీవల ఢిల్లీ వేదికగా రాహుల్‌గాంధీ ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఓట్ల కుట్రపై ప్రజెంటేషన్స్ ఇచ్చారు. తాజాగా ఇదే అంశంపై ఎన్నికల సంఘం స్పందించింది. బీహార్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై రాజకీయ పార్టీలు ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదులు గానీ అభ్యంతరాలు సమర్పించలేదని వెల్లడించింది. ఓటర్ల జాబితా ప్రకటించిన దగ్గర ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదని పేర్కొంది. జూలై 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. బీహార్‌లో జరుగుతున్న ఓట్ల ప్రత్యేక సర్వేపైనే సభలో ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రస్తుతం వాయిదాల పర్వం కొనసాగుతోంది. అయితే ఈ ఆరోపణలను ఈసీ ఖండించింది. అనర్హులైన ఓటర్ల పేర్లనే తొలగిస్తున్నట్లు– తెలిపింది.

# రాజ్యాంగం మార్చాలన్న కుట్రలో బీజేపీ

- క్విట్ బీజేపీ నినాదంతో ముందుకు వెళ్లాల్సిందే..
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, ఆగస్టు 9 :** బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ప్రకారం, బీజేపీ చర్యలు అన్ని ఈ కుట్రలో భాగంగానే జరుగుతున్నాయి. శనివారం గాంధీభవన్లో "క్విట్ ఇండియా" దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండా ఎగరగొట్టబడింది. "క్విట్ బీజేపీ" నినాదంతో దేశానికి రక్షణ అవసరమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అలాగే, ఎలక్షన్ కమిషన్‌పై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను కూడా ప్రదర్శించారు. ఈ సమావేశంలో టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమం ఎలా జరిగింది అనే విషయాన్ని నేటి యువత తెలుసుకోవాలి అని సూచించారు. 1942లో బ్రిటీష్ పాలకులను తరిమి కొట్టాలని అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ, "క్విట్ ఇండియా" ఉద్యమం అత్యంత కీలకమైనదని ఆయన తెలిపారు. మహాత్మా గాంధీ "డూ ఆర్ డ్యూటీ" నినాదంతో "క్విట్ ఇండియా" ఉద్యమాన్ని నడిపించారని ఆయన కొనియాడారు. నేటి బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ చరిత్రను తుడిచివేయాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నెహ్రూ, సర్దార్, సుభాష్ చంద్రబోస్ వంటి నేతలను చరిత్ర నుండి తుడిచివేయాలని కుట్రలు చేస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. స్వతంత్ర సంస్థలను వాడుకుని ప్రతిపక్షాలపై మోదీ ప్రభుత్వం కుట్రపూరిత దాడులు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎలక్షన్ కమిషన్ బీజేపీ ఫ్రంటల్ ఆర్గనైజేషన్‌గా మారిందని ఆయన ఆక్షేపించారు. ప్రశ్నిస్తే, దేశ ద్రోహుల ముద్ర వేస్తున్నారని దుయ్యబట్టారు. "క్విట్ బీజేపీ" అంటే దేశానికి భవిష్యత్తు అన్నమాట అని ఉద్ఘాటించారు. కులాలు, మతాల పేరిట బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేస్తోందని విమర్శించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు ఏమాత్రం భాగమైనట్లు లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ స్వాతంత్ర్య కోసం ఉద్యమించిందని, కాంగ్రెస్ ఈ దేశ రక్షణ కోసం పని చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## నా వ్యాఖ్యలు వెనక్కు తీసుకోను

- ఫోన్ ట్యాపింగ్‌లో తండ్రీకొడుకుల హస్తం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



**కరీంనగర్, ఆగస్టు 9 :** ఎప్పటికైనా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ జైలుపాలు కావల్సిందేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, కేటీఆర్ బీఆర్ఎస్ నేతలందరి ఫోన్లు ట్యాప్ చేశారని ఆరోపించారు. సొంత పార్టీ నేతలపై కేసీఆర్‌కు నమ్మకం లేదన్నారు. తాను నోటీసులు ఇచ్చుకుంటూ పోతే.. తండ్రీ కొడుకులు ఇద్దరూ జీవితాంతం జైల్లోనే ఉంటా రంటూ మండిపడ్డారు. మావోయిస్టు సానుభూతిపరులమంటూ తన పేరును, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును పోలీసుల లిస్టులో చేర్చారని చెప్పారు. శనివారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్ నేతలకు సిగ్గుంటే పార్టీ నుంచి బయటకు రావాలన్నారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై అసెంబ్లీలో చర్చ ఎందుకు జరపడం లేదు?. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐ ఇస్తే కొల్లిక్కి వస్తుందని పేర్కొన్నారు. రాధాకిషన్ వాంగ్మూలంలో కేసీఆర్ పేరు ఉందని, కానీ విచారణ కోసం కేసీఆర్‌ను ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు. నేను కూడా కుటుంబ సభ్యులపై ప్రమాణం చేస్తా. ఏ గుడికి రమ్మంటారో టైమ్, డేట్ చెప్పాలని సవాల్ విసిరారు. కేటీఆర్ లీగల్ నోటీసులకు నేను భయపడను' అని అన్నారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బండి సంజయ్ చేసిన ఆరోపణలను కేటీఆర్ ఖండించారు. తాజాగా, బండి సంజయ్‌కి లీగల్ నోటీసు పంపించారు. రాబోయే 48 గంటల్లో తనపై చేసిన ఆరోపణలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎక్స్ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రికి కనీస సాధారణ జ్ఞానం కూడా లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ నిర్లక్ష్యపు ప్రకటనలు హద్దులు దాటాయన్నారు.



## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

### ఆర్టీసీలో నోటిఫికేషన్

**హైదరాబాద్, ఆగస్టు 9 :** తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులు టీజీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. హైదరాబాద్ శివారులోని హకీంపేట్‌లో ఐటీఐ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎనిమిది, పదో తరగతి విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కాలేజీలో మోటార్ వెహికల్ మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, పెయింటర్ ట్రేడ్‌లలో కోర్సులు అందిస్తున్నట్లు తన ప్రకటనలో పేర్కొంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆగస్టు 28వ తేదీలోగా అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించింది. ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులు మరింత సమాచారం కోసం 9100664452, 6302649844, 040-69400000 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ సూచనలు చేసింది. మెకానిక్ డీజిల్, వెల్డర్ కోర్సులు ఏడాది వ్యవధిలో పూర్తయ్యే కోర్సులు. ఇక మెకానిక్ (మోటార్ వెహికల్), పెయింట్ కోర్సులు రెండేళ్ల వ్యవధితో అందిస్తున్నారు. వెల్డర్, పెయింటర్ కోర్సులకు ఎనిమిదో తరగతి విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సులకు ఏడాదికి రూ.16,500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలోని ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు పరీక్షల ఫలితాలు మరో రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. తొలుత ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల చేయనున్నారు. అనంతరం 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేస్తారు. అలాగే స్టాఫ్ నర్సు పోస్టుల మెరిట్ జాబితా కూడా విడుదల చేసి, 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు వైద్య నియామక బోర్డు ఏర్పాట్లు చేస్తుంది.

## కోర్ట్ ఆఫ్ ఆస్తుల కింద ప్రభుత్వానికి లక్షల కోట్లు ఆదాయం

### మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు



**హైదరాబాద్, ఆగస్టు 9 :** కోర్ట్ ఆఫ్ వార్డ్స్ ఆస్తుల కింద రాష్ట్ర ప్రభుత్వానికి లక్షల కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉందని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు తెలిపారు. గత ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి, రోశయ్య ఇతరులకు చెప్పానని.. వారు పట్టించుకోలేదని చెప్పుకొచ్చారు. ఢిల్లీ వేదికగా శనివారం మీడియాతో గోనె ప్రకాష్ రావు మాట్లాడారు. ప్రస్తుత రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కూడా చెప్పానని.. దీనిపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరానని.. వారిని కలిసి ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఏఐసీసీ పెద్దలకు కలిసి తన వద్ద ఉన్న వివరాలు అందిస్తానని స్పష్టం చేశారు గోనె ప్రకాష్ రావు. తెలంగాణలో 6 రాజ కుటుంబాల ఆస్తులు, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన ఆస్తులు ప్రైవేట్ వారి చేతుల్లో ఉన్నాయని గుర్తుచేశారు. బ్రిటిష్ చట్టం కాబట్టి దీనిపై ఎవరు ఏమి చేయలేకపోతున్నారని అన్నారు. ల్యాండ్ క్రూజర్ కార్లు, ఇన్నోవా కార్లపై మాత్రమే ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టి ఉందని వెల్లడించారు. రేపు ప్రతి మంత్రి హెలికాప్టర్‌లో తిరగాలని ప్లాన్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చాలని తాను చూస్తున్నానని తెలిపారు గోనె ప్రకాష్ రావు. రెండు రోజుల్లో కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని కలుస్తానని.. ఆ ఆస్తులను కాపాడాలని కోరుతానని గోనె ప్రకాష్ రావు చెప్పారు. గతంలో ఈ విషయంపై జానారెడ్డి అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడారని గుర్తుచేశా రు. తెలంగాణ రాష్ట్రంలో పూర్తయిన తర్వాత కేంద్రంలో కూడా కోర్ట్ ఆఫ్ వార్డ్స్ ఆస్తుల అంశాన్ని బీజేపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా నని చెప్పుకొచ్చారు. ఆదాయాన్ని సమకూర్చుకుంటే రెండు ప్రభు త్వాలు ఇచ్చిన హామీలు అమలు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజా హితం కోసం తన వంతుగా ఈ విసయంపై ప్రయత్నం చేస్తున్నానని గోనె ప్రకాష్ రావు పేర్కొన్నారు.

## బహుశా రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంటా

### మాజీ మంత్రి మల్లారెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 9 :** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి మల్లారెడ్డి తన రాజకీయ జీవితంపై సంచలన కామెంట్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మల్లారెడ్డి మాట్లాడారు. తాను రాజకీయంగా బీజేపీ వైపా, తెలుగుదేశం వైపా, బీఆర్ఎస్ పార్టీల వైపా అన్నది కాదని... తాను ఇప్పటికీ కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని క్లారిటీ ఇచ్చారు మల్లారెడ్డి. తాను ఇప్పుడు ఏ వైపుకు చూసేటట్లుగా కూడా లేనని స్పష్టం చేశారు. తనకు 73 సంవత్సరాలు వచ్చాయని.. ఇంకా ఏ వైపుకు చూడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. తాను ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిని అయ్యానని ఇంకా మూడేళ్లు రాజకీయాల్లో ఉంటానని చెప్పుకొచ్చారు. అస్సలు తాను రాజకీయమే వద్దనుకుంటున్నానని తెలిపారు. ప్రజలకు సేవ చేసి మంచి కాలేజీలు, యూనివర్సిటీలు నడిపిద్దామని అనుకుంటున్నానని మల్లారెడ్డి పేర్కొన్నారు.

## యాంటీ ర్యాగింగ్ వీక్ పెట్టాల్సిందే

### మెడికల్ కళాశాలలకు ఎన్ఎంసీ ఆదేశాలు



**హైదరాబాద్, ఆగస్టు 9 :** దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో ఆగస్టు 12 నుంచి ఆగస్టు 18 వరకు యాంటీ ర్యాగింగ్ వీక్‌ను పాటించాలని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తన పరిధిలోని అన్ని మెడికల్ కాలేజీలను కోరుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఆగస్టు 12వ తేదీని యాంటీ ర్యాగింగ్ డేగా అన్ని మెడికల్ కాలేజీల్లో సెలబ్రేట్ చేసుకోవాలని పేర్కొంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. యూజీసీ నిర్దేశించిన యాంటీ-ర్యాగింగ్ ఫ్రేమ్‌వర్క్ అమలులో భాగంగా దీనిని పాటించాలని తన నోటీసులో పేర్కొంది. ఈ నిబంధనలు తప్పనిసరని స్పష్టం చేసింది. అన్ని ఉన్నత విద్యా సంస్థలు ఈ నిబంధనలలో పేర్కొన్న పర్యవేక్షణ విధానాలుతో సహా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కూడా పేర్కొంది. యాంటీ-ర్యాగింగ్ వీక్ సందర్భంగా మెడికల్ కాలేజీల్లో పలు కార్యకలాపాలను నిర్వహించాలని యూజీసీ వివరించింది. ఈ సందర్భంగా యాంటీ-ర్యాగింగ్ వీక్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు, నినాదాలు రాయడం, వ్యాస రచన, పోస్టర్ తయారీ, ఫోటోగ్రఫీ పోటీలు, వీధి నాటకాలు, యాంటీ-ర్యాగింగ్ ఇతివృత్తాలపై డిబేట్స్ వంటి కార్యకలాపాలతో విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని సూచించింది. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేసి, వారిని భాగస్వాములను చేయాలని తెలిపింది. డిజిటల్ పోస్టర్లు, షార్ట్ వీడియోలు, యాంటీ-ర్యాగింగ్ సందేశాలను హైలైట్ చేసే రీల్స్‌పై దృష్టి సారించేలా నేషనల్ కాంటెస్ట్ 2025 ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి కాలేజీలు, యూనివర్సిటీలు కృషి చేయాలని యూజీసీ ఆదేశించింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు యాంటీ-ర్యాగింగ్ పోర్టల్ అందుబాటులో ఉన్నాయి. విద్యా సంస్థలు డిజిటల్ ప్రచారం కూడా చేయవచ్చు. ర్యాగింగ్ వ్యతిరేక సందేశాలను ప్రోత్సహించే సంస్థల నుంచి వీడియో సందేశాలను వినియోగించవచ్చని వివరించింది. వర్క్‌షాప్‌లు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్‌లు, సెల్ఫీ కార్నర్‌ల వంటి సృజనాత్మక మార్గాలు వంటి అవగాహన కార్యకలాపాలను క్యాంపస్‌లో ఏర్పాటు చేయాలని సూచించింది. ఆఫ్‌లైన్ కార్యకలాపాలతో పాటు విద్యార్థులు, అధ్యాపకుల కోసం విద్యా సంస్థలు యాంటీ-ర్యాగింగ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న షార్ట్ మువీలు, అవగాహన వీడియోలను ప్రదర్శించాలని సంస్థలకు సూచించింది.

## హైకోర్టు ఆదేశాలకనుగుణంగా స్థానిక ఎన్నికలు

### కావాలనే రిజర్వేషన్లపై బీజేపీ రాద్ధాంతం : పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, ఆగస్టు 9 :** బీసీల రిజర్వేషన్లపై బీజేపీ పార్టీ కావాలనే రాద్ధాంతం చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే స్థానిక ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని తమ ప్రభుత్వం ఎక్కడా పేర్కొనలేదని స్పష్టంచేశారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు బీజేపీ నేతలు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు కావాలనే బీజేపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో వారి సోదరులకు మంత్రి సీతక్క రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీతక్కకు మంత్రి పొన్నం చీరను బహూకరించారు. సీతక్క నుంచి పొన్నం ప్రభాకర్ ఆశీర్వాదం తీసుకున్నారు. సీతక్కకు పొన్నం ప్రభాకర్ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాఖీ పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ రాఖీ కట్టారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సోదరి సీతక్క అంటూ ఆత్మీయంగా పలకరించి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుకి మంథని నియోజకవర్గ మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.



## రాహుల్‌గాంధీకి శరద్‌పవార్ మద్దతు

**ఢిల్లీ, ఆగస్టు 9 :** మహారాష్ట్ర రాజకీయాల్లో అనేక మార్పులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శరద్ పవార్ తాజాగా రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచారు. రాహుల్ గాంధీ ఇటీవల ఓ ప్రెజెంటేషన్ ద్వారా ఓట్ల దొంగతనం, ఫేక్ ఓటర్ల లిస్ట్ గురించి ప్రస్తావించారు. దీనిపై శరద్ పవార్ తనదైన శైలిలో స్పందించారు. ఈ విషయాన్ని భారత ఎన్నికల కమిషన్ సమగ్రంగా పరిశీలించాలని, ఇది చిన్న విషయం కాదన్నారు. వాటిలో కర్ణాటక, మహారాష్ట్రలలో ఎన్నికలు లేకపోయినా, దేశవ్యాప్తంగా పద్ధతిగా జరిగే ఎన్నికల మీద ఇలాంటి అంశాలు ప్రభావం చూపుతాయని ఆయన హెచ్చరించారు. రాహుల్ గాంధీ ఈ విషయాలను ప్రస్తావించే ముందు స్పష్టమైన అధ్యయనం చేశారని పవార్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీంతోపాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇండియాపై తిరిగి 25% నుంచి 50% వరకు దిగుమతి సుంకాలు పెంచే ప్రతిపాదన చేయడం పట్ల శరద్ పవార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారత్‌పై ఒత్తిడి తేవాలనే ప్రయత్నం అని ఆయన పేర్కొన్నారు. విదేశాంగ విధానాల్లో మన దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా ఆయన స్వరం పెంచారు. పాకిస్తాన్ శత్రువులా మారింది, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకతో సంబంధాలు అంత మంచిగా లేవన్నారు. మనం ఈ సంబంధాలను మెరుగుపరచుకోవాలన్నారు. ఇటీవల ముంబైలో జరిగిన యుగేంద్ర పవార్ నిశ్చితార్థ వేడుకలో శరద్ పవార్, అజిత్ పవార్ ఇద్దరూ కలిసి పాల్గొన్నారు. దీంతో శివసేన బీజేపీ కూటమికి శరద్ పవార్ మద్దతు ఇవ్వబోతున్నారా? అనే చర్చ మొదలైంది. కానీ శరద్ పవార్ తన పాత ధోరణి గురించి స్పష్టం చేశారు. బీజేపీకి ఎప్పటికీ మద్దతు ఇవ్వనని, రాజకీయాల్లో తన సిద్ధాంతాలకే కట్టుబడి ఉంటానని మరోసారి గుర్తు చేశారు.

## ఆపరేషన్ సిందూర్‌లో ఐదు జెట్లను కూల్చేశాం

### ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్



**ఢిల్లీ, ఆగస్టు 9 :** ఆపరేషన్ సింధూర్ సంద ర్భంగా పాకిస్తాన్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్లను కూల్చేశామని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ.. 'ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సాయంతో ఐదు పాకిస్తాన్ జెట్లను పేల్చిపడే శాము. ఐదు జెట్లను మాత్రమే కాకుండా.. ఓ భారీ 'ఎయిర్‌బర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్ క్రాఫ్ట్'ను కూడా కూల్చేశా ము. రెండు వైమానిక స్థావరాలు ధ్వంసం చేశాం. మే 9, 10 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. మే 9వ తేదీ రాత్రి ఎక్కువగా పాక్ ఉగ్ర శిబిరాలపై దాడులు చేశాం. డ్రోన్, ఎస్ 400 గగనతల రక్షణ వ్యవస్థ బాగా పనిచేసింది. వారి యుద్ధ విమానాలు భారత గగనతలంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నాం. వాటిని ఎంతో సమర్థవంతంగా కూల్చివేశాం. ఆపరేషన్ సింధూర్‌తో పాక్‌కు స్పష్టమైన సందేశమిచ్చాం' అని ఆయన అన్నారు. కాగా, ఏప్రిల్ 22వ తేదీన జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. అమాయక పర్యాటకులను కాల్చి చంపారు. 26 మందిని బలి తీసుకున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు చేసింది. దీంతో 100 మంది ఉగ్రవాదులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉగ్రవాదులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకోవటంతో పాక్ తట్టుకోలేకపోయింది. యుద్ధానికి దిగింది. యుద్ధంలో భారీ ఎత్తున నష్టపోయింది. చివరకు తోకముడిచింది.

## భారత్‌పై ద్వేషంతో పాకిస్థాన్ 400 కోట్లు నష్టపోయింది



**ఢిల్లీ, ఆగస్టు 9 :** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ ఎన్నో నిర్ణయాలు తీసుకుని వాటిని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో పాకిస్థాన్ కూడా భారత్‌కు వ్యతిరేకంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంది. భారత్ విమానాలకు గగనతలాన్ని మూసేయడం ఆ వ్యతిరేక నిర్ణయాల్లో ఒకటి. అయితే పాకిస్థాన్ తీసుకున్న ఆ నిర్ణయం ఆ దేశానికి తీవ్ర నష్టం కలుగజేసింది. ఈ నిర్ణయం కారణంగా పాకిస్థాన్ రెండు నెలల్లోనే దాదాపు రూ.400 కోట్లు కోల్పోయింది. భారత్ నుంచి వచ్చే విమానాలను ఏప్రిల్ 24 నుంచి పాకిస్థాన్ తన గగనతలంలోకి అనుమతించడం లేదు. ఈ నిషేధం ఇప్పటికీ కొనసాగుతోంది. నిజానికి భారత్ నుంచి వెళ్లే అంతర్జాతీయ విమానాలు చాలా వరకు పాకిస్థాన్ గగనతలాన్ని వాడుకుంటాయి. పాక్ గగనతలం మీదుగా రోజుకు 100 నుంచి 150 భారతీయ విమానాలు ప్రయాణిస్తుం టాయి. ఇలా గగనతలాన్ని వాడుకున్నందుకు ఓవర్ ఫ్లైయింగ్ ఛార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క బోయింగ్ విమానం పాక్ గగనతలం మీదుగా ప్రయాణిస్తే దాదాపు 580 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. పాకిస్థాన్ గగనతలం మూసేయడంతో భారత్ విమా నాలు వేరే మార్గాల్లో ప్రయాణిస్తున్నాయి. దీంతో ఆ ఓవర్ ఫ్లైయింగ్ ఛార్జీలను పాకిస్థాన్ కోల్పోయింది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 20 మధ్యలో పాకిస్థాన్ ఎయిర్ పోర్ట్స్ అథారిటీకి రూ.410 కోట్ల నష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని పాక్ రక్షణ మంత్రిత్వ శాఖ అక్కడి అసెంబ్లీలో వెల్లడించినట్లు డాన్ నివేదించింది. ఈ ఆంక్షల వల్ల పాకిస్థాన్ ఏడాదికి వేల కోట్ల రూపాయలను కోల్పోతుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

## గోవాలో తెలుగు జంటపై దాడి

**హైదరాబాద్, ఆగస్టు 9 :** గోవాలో మరో దారుణం చోటు చేసుకుంది.. గోవా విహార యాత్రలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన ఓ జంటపై పనాజీ బస్‌స్టాండ్ వద్ద దాడి జరిగింది. బైక్ అద్దె విషయంలో జరిగిన చిన్నపాటి వివాదం ఘర్షణకు దారి తీసింది. వరుసగా సెలవులు రావడంతో.. హైదరాబా ద్‌కు చెందిన ఈ జంట గోవాలో గడిపేందుకు వెళ్లారు. అక్కడ ప్రయాణానికి బైక్ అద్దెకు తీసుకున్నారు. ఒప్పందం ప్రకారం.. బైక్‌ను సమయానికి తిరిగి అప్పగించినప్పటికీ.. బైక్ అద్దెకు ఇచ్చినవాళ్లు అదనంగా రూ.200 చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. దీంతో ఎందుకు చెల్లించాలంటూ వారు.. బైక్ అద్దెకు ఇచ్చిన వారిని ప్రశ్నించారు. ఈ విషయంలో ఇరువురు మధ్య వాగ్వాదం తలెత్తింది.. ఈ క్రమంలో పనాజీ బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న కొంతమంది బైక్ అద్దెకు ఇచ్చే వ్యక్తులు గుంపుగా వచ్చి జంటపై దాడికి పాల్పడ్డారు. దాడిలో హైదరాబాద్ వ్యక్తి తలకు గాయాలపాల య్యారు. గర్భిణి అయిన మహిళకు ముఖం తీవ్రంగా ఉబ్బిపోయింది. గాయాలైన జంటను వెంటనే గోవా మెడికల్ కాలేజ్‌కి తరలించారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి ఘటనలు గోవా లో పర్యాటకుల భద్రతపై ప్రశ్నలు రేపుతున్నాయి. పోలీసులు పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవా లని బాధితుల కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో కూడా గోవాలో జరిగిన గొడవలో ఏపీకి చెందిన ఓ యువకుడు మరణించిన విషయం తెలిసిందే.. ఇలాంటి ఘటనల నేపథ్యంలో గోవాకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండటం మంచిదని పోలీసులు చెబుతున్నారు.

# గాలికొదిలేసిన గిరిజన సంక్షేమం



గిరిజనుల అభివృద్ధి విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యింది. కనీస రహదారులు, వైద్యం, విద్య, మంచినీరు వంటి సదు-పాయాలు నేటికీ గిరిజన గూడాల్లో కనిపించవు. ఆపదొస్తే డోలీలో మోసుకు ఆవడం ఇప్పటికీ  ఈచూస్తున్నాం. ఇటీవల ఓ గర్భిణిని కాన్పు కోసం డోలీలో వర్షంలో తడుచుకుంటూ మోసుకొచ్చారు. అంటే ఇంకా మనం వారి అభివృద్ధి విషయంలో వెనకబడే ఉన్నామని చెప్పాలి. ఏపిలో పవన్ కళ్యాణ్ డిప్యూటి సిఎం అయ్యాక కొన్ని సమస్యలపై దృష్టి సారించారు. అందుకు ఆయనను అభినందించాల్సిందే. అలాగే తెలంగాణలో సీతక్క అడవిబిడ్డ కావడంతో వారి కష్టాలు తెలుసుకుని ముందుకు సాగుతున్నారు. తనవంతుగా వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అయితే మిగతా రాష్ట్రాల సంగతి పక్కన పెడితే తెలుగు రాష్ట్రాల్లో వారి జీవితాల్లో ఇంకా వెలుగులు నిండలేదు. ప్రభుత్వాలు చెబుతున్నంతగా అభివృద్ధి జరగడంలేదు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 1994లో ఐక్యరాజ్య సమితి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవంగా ప్రకటించింది. ఏటా ఉత్సవాలు చేయడం, వారికి తాయిలాలు ప్రకటించడం తప్ప గట్టిగా చర్యలకు మాత్రం పూనుకోవడం లేదు. ప్రభుత్వాలు మారినా ఆదివాసీల పట్ల పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. నేటికీ వైద్యం అందుబాటులో లేదు. ప్రతి సంవత్సరం మలేరియా, –టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో వందలాది మంది మరణిస్తున్నారు. ఆసుపత్రులు ఎన్ని ఉన్నా సరైన మందుల, వైద్యులు, ఇతర సిబ్బంది కొరత వెంటాడుతుంది. సరైన రహదారి సౌకర్యాలు లేక నేటికీ గిరిజనులు డోలీమోతతోనే ఆసుపత్రికి చేరుతున్నారు. కొన్ని సందర్భాల్లో సమయానికి వైద్యం అందక దారి మధ్యలోనే మరణిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో విద్య అందనంత దూరంలో ఉంది. ప్రతి సంవత్సరం ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ గురుకులాల్లో సీట్ల కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అంతంత మాత్రమే సీట్లు ఉండడంతో చదువు మధ్యలోనే ఆగిపోతుంది. సంక్షేమ హాస్టళ్లల్లో సౌకర్యాలు లేమి, పౌష్టికాహారం లోపంతో పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. చదువుకున్న విద్యార్థులకు సరైన ఉపాధి లేక రోజురోజుకూ నిరుద్యోగ సమస్య తీవ్రంగా తయారైంది. చదువుకున్న యువతీయువకులు వలసలు వెళ్తున్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపద ఉన్న ప్రకృతి మధ్యలో నిరుపేదలుగా జీవనం కొనసాగిస్తున్నారు. మనదేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 8.6 శాతం ఆదివాసీలు ఉన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో వీరి సంఖ్య ఎక్కువగా ఉంది.

అక్షరాస్యతతో పోలిస్తే గిరిజన ప్రాంతంలో అక్షరాస్యత అతి తక్కువ. మహిళ అక్షరాస్యత 34.67 శాతం. గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, హక్కులు రాజ్యాంగం కల్పించింది. వీరి అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు, పరిపాలన వ్యవస్థ ఉండాలని రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ అమలు జరగడం లేదు. షెడ్యూల్ ప్రాంతానికి ఆనుకుని ఉన్న నాన్ షెడ్యూల్ మండలాల్లో వేలాదిమంది గిరిజనులు ఉన్నారు. వీరి గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో కలపాలని అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నా గిరిజన చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. మెజార్టీ గిరిజనులు అడవిలో జీవిస్తున్నారు.  విలువైన ఖనిజాలు కూడా వీరి నిర్వాసిత ప్రాంతాల్లో ఉన్నాయి. ఇంత విలువైన సంపదను గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఉపయోగించాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను బలహీనం చేసి, అటవీ భూమి, సహజ వనరులను బహుళజాతి, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారు. మనం ఎంతో అభివృద్ధి చెందామని భావిస్తున్న ఈ రోజుల్లో కూడా ఆదివాసీలు కనీస సౌకర్యాలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు నోచుకోలేదు.

ఆదివాసీలను భూముల నుండి దూరం చేసే కుట్రలు సాగుతున్నాయి. గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70, అటవీ హక్కుల చట్టాలను ఒక్కొక్కదాన్ని నీరు గారుస్తున్నారు. అటవీ భూముల్ని సాగు చేసుకున్న వారికి అటవీహక్కుల చట్టం ప్రకారం 10 ఎకరాల వరకూ హక్కుపత్రాలు ఇవ్వాలి. కానీ గిరిజనుల సాగులో ఉన్న భూములకు నేటికీ పట్టాలు ఇవ్వడం లేదు. హక్కు పత్రాలు ఇచ్చిన అరెకరం, ఎకరం లోపునే ఎక్కువ మందికి ఇచ్చారు. అడవులను నమ్ముకుని బతుకుతున్న కోట్లాదిమంది బతుకు నాశనం చేసే నిర్ణయం కేంద్రం తీసుకొచ్చింది. గ్రామసభ అనుమతి లేకుండా అటవీ భూములను వివిధ ప్రాజెక్టులకు వినియోగించే పక్రియకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. అటవీ పరిరక్షణ నిబంధనలకి 2022లో నోటిఫైడ్ చేస్తూ కేంద్ర పర్యావరణ అటవీశాఖ ఆదేశాలు జారీ చేసింది. అడవుల్లో నివశించే గిరిజనుల అనుమతి అవసరం లేకుండా భూములు కేటాయింపు జరుగుతోంది. ఇది అత్యంత ప్రమాదకర మని ఇప్పటికే గిరిజన సంఘాలు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో అడవులను నమ్ముకుని కోట్లాదిమంది జీవిస్తున్నారు.  గిరిజన ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. నదీ జలాలన్నీ ఏజెన్సీల్లోనే ఉన్నాయి. కానీ ఆదివాసీలకు రక్షిత మంచినీరు అందుబాటులో లేదు. ఏజెన్సీ గ్రామాలకు సంపూర్ణంగా విద్యుత్ సదుపాయం లేదు. ఈ సమస్యలను పరిష్కరించకుండా ఎన్ఇన హామీలు ఇచ్చినా గిరిజన సంక్షేమం నెరవేరదని పాలకులు గుర్తించాలి. కనీస సౌకర్యల కల్పన విద్యవిద్యం వంటి విషయాల్లో అడుగులు పడాలి.

# దేశంలో ఊపందుకున్న ట్రంప్ వ్యతిరేక ప్రచారం

- అమెరికా ఉత్పత్తులను నిషేధించాలన్న డిమాండ్
- ఎక్స్ వేదికగా కోకాకోలా, పిజ్జా, కెఎఫ్‌సీల బహిష్కరణ ఉద్యమం



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 9 :** ట్రంప్ తీరుపై ఆగ్రహంగా ఉన్న భారతీయులు ఆయనకు వ్యతిరేకంగా ఏకమవుతున్నారు. అమెరికా ఉత్పత్తులను నిషేధించాలన్న స్థాయికి ప్రచారం సాగుతోంది. ఇది కేవలం భారత్‌లో మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకుంటోంది. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలోనే కాక ఇతర దేశాల్లోనూ నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ట్రంప్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ఆన్‌లైన్ ప్రచారాల్లో భారతీయులు భాగస్వాములు అవుతున్నారు. "ట్రంప్ ఈజ్ అన్‌ఫిట్ ఫర్ ఆఫీస్", "అరెస్ట్ ట్రంప్" వంటి హ్యాష్‌ట్యాగ్‌లతో 1500కు పైగా పోస్టులు, మరో 1900 పోస్టులు కీలక పదాలతో నమోదయ్యాయి. దాదాపు 300 మంది నెటిజన్లు వ్యక్తిగత దూషణలు, అవమానకర పదాలతో 3000కు పైగా పోస్టులు చేశారు. అమెరికా అధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి పదజాలం వినియోగించే ధోరణి ఇటీవల ప్రపంచవ్యాప్తంగా విపరీతంగా పెరిగింది. అమెరికా ఉత్పత్తులు, వ్యాపారాలను బహిష్కరించాలంటూ భారత్ నుంచి విస్తృత స్థాయిలో పిలుపులు రావడం ఇదే మొదటిసారి కావచ్చని విశ్లేషకులు అంటున్నారు. ట్రంప్ వ్యవహారశైలిపై భారతీయుల్లో వ్యతిరేకత పెరిగిపోతోంది. భారత్‌తో పాటు ఇతర దేశాలపై వరుసగా సుంకాలు విధిస్తున్న ఆయన తీరును వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఒకప్పుడు ట్రంప్‌కు మద్దతిచ్చినవారు కూడా ఇప్పుడు ఆయనను తిరస్కరిస్తున్నారు. ఈ మేరకు ఆన్‌లైన్ వేదికల్లో పలు సామాజిక మాధ్యమాల్లో ట్రంప్, అమెరికా ఉత్పత్తులు, కంపెనీలకు వ్యతిరేకంగా ప్రచారం తీవ్రంగా సాగుతోంది. అమెరికా కంపెనీలను బహిష్కరించాలి, ట్రంప్ చర్యలకు ప్రతిఘటన చూపాలని కొంతమంది భారతీయులు పిలుపు ఇస్తున్నారు. భారత్‌లో "ఎక్స్" వేదికగా ట్రంప్ వ్యతిరేక వైఖరి పెరిగినట్టు గుర్తిస్తున్నారు. రష్యా నుంచి చమురు ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై ట్రంప్ ఇప్పటికే 25 శాతం సుంకం విధించారు. దానికి పెనాల్టీగా ఈ నెల 28న మరో 25 శాతం టారిఫ్ విధించేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతోంది. తాజా విశ్లేషణ ప్రకారం భారత్‌పై ఆయన విధించిన టారిఫ్‌ల పెరుగుదల భారతీయుల్లో ఈ ఆగ్రహానికి కారణమైంది. అమెరికా కంపెనీలను లక్ష్యంగా చేసుకుని వాటిని బహిష్కరించాలన్న ప్రచారం "ఎక్స్" లో తీవ్రరూపం దాల్చింది.

### ప్రముఖ వ్యాపారాలే లక్ష్యంగా..

అమెరికాకు చెందిన ప్రముఖ వ్యాపారాలే లక్ష్యంగా వేలాదిగా "ఎక్స్" పోస్టులు వెలువడుతున్నాయి. ఇందులో 10,000కి పైగా పోస్టులు కోకాకోలాను నిషేధించాలన్నవే. 9,100కు పైగా పోస్టులు మెటా సంస్థకు చెందిన ఫేస్‌బుక్‌ను లక్ష్యంగా చేశాయి. స్టార్‌బక్స్‌ను బహిష్కరించాలంటూ 5,200కి పైగా పోస్టులు వచ్చాయి. అలాగే 2,700 పోస్టులు పిజ్జాహట్‌ను, 5,000కి పైగా పోస్టులు కెఎఫ్‌సీని టార్గెట్ చేశాయి. కనీసం 10,000 పోస్టుల్లో "బహిష్కరించండి అమెరికాను", "బహిష్కరించండి యుఎస్‌ఏ" వంటి పదాలు ఉన్నాయి. ట్రంప్ టారిఫ్ వార్‌పై భారత్ మాత్రమే కాకుండా ప్రపంచంలోని పలు దేశాలు కూడా ఇదే విధంగా స్పందిస్తున్నాయి. ఈ ఆగ్రహం కెనడాలో మూడు నెలల క్రితమే మొదలైంది. అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టాలని నిర్ణయించిన వారు, అక్కడ ప్రాచుర్యం పొందిన అమెరికానో కాఫీకి "కెనడియానో"గా పేరు మార్చారు. యూరప్‌లో కూడా అక్కడి వినియోగదారులు అమెరికా విదేశాంగ విధానంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సుంకాలతో గందరగోళం సృష్టిస్తున్న ట్రంప్ వ్యవహారంపై "ట్రంప్ టవర్"లపై చర్చ నడుస్తోంది. ట్రంప్ విధిస్తున్న సుంకాలకు ప్రతిగా హైదరాబాద్‌తో పాటు గురుగ్రామ్, కోల్‌కతా, ముంబయి, పుణేలో ఉన్న "ట్రంప్ టవర్" రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లలో విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌ల కొనుగోళ్లపై భారీ పన్నులు విధించాలని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# ధర్మస్థల వ్యవహారంలో కానరాని పురోగతి

## చూపిన చోటల్లా తవ్వుతున్నా బయటపడని ఆనవాళ్లు



**బెంగళూరు, ఆగస్ట్ 9 :** ధర్మస్థలలో సిట్ దర్యాప్తు ఒకవైపు, తవ్వకాలు మరోవైపు కొనసాగు తున్నాయి. అయితే ఆధారాలు పెద్దగా లభించడం లేదు. తవ్వకాలు, తమకు దొరికిన ఎముకలు, ఇతర అవశేషాలకు సంబంధించి సిట్ అధికారులు వివరాలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. తవ్వకాలు చేస్తున్న చోటుకు ఉప్పుమూటల్ని తీసుకువెళుతున్నారు. దొరికిన వాటిని సంచుల్లో ఉంచుకుని, వాటికి తెల్లవస్త్రాన్ని చుట్టి తీసుకువెళుతున్నారు. బెళ్తంగడి సిట్ కార్యాలయానికి తీసుకువెళ్లి, అక్కడి నుంచి మణిపాల్ కేఎంసీకి పంపిస్తున్నారు. మణిపాల్ నుంచి బెంగళూరులోని ఫోరెన్సిక్ ప్రయోగశాలకు ఆయా సంచులను చేరవేస్తున్న ఘట్టం నిగూఢంగా సాగుతోంది. ధర్మస్థలలో సిట్ చేపట్టిన కార్యాచరణకు, తమకు సంబంధాన్ని అంటగడుతూ కొన్ని ప్రచార మాధ్యమాలు, యూట్యూబర్లు చేస్తున్న ప్రచారాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఆలయ ప్రముఖుడు హర్షేంద్రకుమార్ హెగ్గడే వేసుకున్న అర్జీని సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం తోసిపుచ్చింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను ప్రశ్నిస్తూ ధర్మస్థల కార్యదర్శి హర్షేంద్ర కుమార్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రచార మాధ్యమాలను నియంత్రించాలని పదేపదే న్యాయస్థానాలను ఆశ్రయించవలసిన అవసరం ఏముందని జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని పీఠం అనుమానాన్ని వ్యక్తం చేసింది.  మీమ్‌లు, అభ్యంతరకరమైన అంశాలపై కర్ణాటకలోని న్యాయస్థానంలో అర్జీ వేసుకోవాలన్నారు. మీకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేయవలసిన అవసరం మాధ్యమ ప్రతినిధులకు ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. ఇకపోతే తాను వందలాది శవాలను పూడ్చి పెట్టానని ప్రకటించిన ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు భీమ సహకారంతో ప్రత్యేక దర్యాప్తు దళం సిట్ తవ్వకాలను కొనసాగిస్తోంది. అయిత అక్కడ పెద్దగా ఎలాంటి శవాల ఆనావాళ్లు కానరావడం లేదు. మొదట 13 ప్రాంతాలు, అనంతరం ఒక కొత్త ప్రదేశంతో పాటు, మరో మూడు ప్రాంతాలను ఆ వ్యక్తి చూపించాడు. వాటిలో మొదటి 12 ప్రాంతాల్లో తవ్వకాలు పూర్తిచేయగా, ఆరో ప్రాంతంలో మాత్రమే ఎముకలు లభించాయి. మరో చోట ఉరి వేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. 13వ ప్రాంతంలో తాను ఎనిమిదికిపైగా మృతదేహాలను పూడ్చి పెట్టానని ఆ వ్యక్తి చెప్పడం గమనార్హం. ఆ ప్రాంతాన్ని కాదని.. గురువారం కొత్తగా గుర్తించిన ప్రాంతంలో తవ్వకాలు చేపట్టినా ఏమీ లభించలేదు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భీమను సిట్ అధికారులు విచారించారు. అతను కొత్తగా చూపించిన మూడు ప్రాంతాల్లో ఒక చోట సాయంత్రం వరకు తవ్వారు. అయినా తాను మరో 30 ప్రాంతాలను చూపిస్తానని, అక్కడ తవ్వకాలు చేయాలని కోరాడు. జీపీఆర్ కోసం...: భీమ చూపించిన 13వ ప్రాంతంలో తవ్వకాలకు ముందస్తుగా జీపీఆర్ పరికరాన్ని వినియోగించి తవ్వకాలు కొనసాగించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం, జీపీఆర్ పరికరాన్ని బాడుగకు తీసుకోవలసిన అవసరం ఉండడంతో ఆ ప్రదేశంలో తవ్వకాలు సాగలేదు. ఎవరూ అక్కడకు రాకుండా సాయుధదళాన్ని భద్రతకు నియమించారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే జీపీఆర్ పరికరాన్ని బాడుగకు తీసుకుంటామని సిట్ అధికారి తెలిపారు. మొత్తంగా భీమ చెప్పిన ప్రాంతాల్లో ఎక్కడా బలమైన ఆధారాలు దొరకలేదు. దీంతో ఇప్పుడు భీమపై అనుమానాలు కూడా వస్తున్నాయి.

# ఆర్టీసీ నిర్వహణ నిమిత్తమే చార్జీల పెంపు

## పండుగ తర్వాత చార్జీలు యథాతథం : ఆర్టీసీ యాజమాన్యం




**హైదరాబాద్, ఆగస్టు 9 :** రాఖీ పండుగకు చార్జీలు పెంచడంపై ప్రయాణికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్టీసీ నిర్వహన కారణంగా కొంత చార్జీలు పెంచినట్టు తెలిపింది. పండుగ తరువాత రేట్లు యథాయథంగా ఉంటాయని వెల్లడించింది. ఈ నెల 11 వరకు స్పెషల్ బస్సుల్లో చార్జీలు పెంచినట్లు వెల్లడించింది. ఆ తర్వాత చార్జీలు సాధారణంగానే ఉంటాయని పేర్కొంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులు లేకున్నా బస్సులను వెంటనే తిరిగి తీసుకురావాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో నిర్వహణ ఖర్చుల నిమిత్తం స్పెషల్ బస్సుల్లో మాత్రమే చార్జీలు పెంచామని వెల్లడించింది. 'సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, అనుబంధాలకు ప్రతికైనా రాఖీ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ప్రయాణికులకు రవాణాపరమైన అసౌకర్యం కలుగకుండా టీజీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది మాదిరిగానే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం రాఖీ పండుగకు నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో మాత్రమే రూ.1.50 వరకు టికెట్ ధరలను సవరించింది. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. ఈ నెల 11వ తేదీ వరకు నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఈ సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేసింది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవో ప్రకారం స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను రాఖీ పండుగ సందర్భంగా సంస్థ సవరించింది. రాఖీ పౌర్ణమికి ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని ప్రజలకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సూచిస్తోంది. ఆర్టీసీ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సొంతూళ్లకు వెళ్లే వారు తమ బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతూ.. అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తోంది.' అని తెలిపింది. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లలో రాఖీ పండుగ ప్రయాణికుల రద్దీ నెలకొంది. సికింద్రాబాద్ జేబీఎస్, ఎంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్ బస్టాండ్లలో బస్సుల కోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు.



# మంత్రాలయ ఉత్సవాలకు టిటిడి పట్టు వస్త్రాలు

**మంత్రాలయం, ఆగస్టు 9 :** తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన పట్టు– వస్త్రాలు ఊరేగింపుతో రాఘవేంద్రస్వామి మఠం చేరుకున్నాయి. శనివారం రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల సందర్భంగా టిటిడి ఎఇఓ రామకృష్ణ తిరుమల తిరుపతి దేవస్థానాల నుండి శ్రీవారి వస్త్రాన్ని తీసుకువచ్చారు. శ్రీ మఠం అధికారులు,పండితుల వేద మంత్రాల మధ్య మంగళ వాయిద్యాల నడుమ ప్రధాన ఆర్చి మహాద్వారం వద్ద నుంచి సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. మధ్వ కారిడార్ గుండా శ్రీ మఠానికి చేరుకున్న వారు గ్రామ దేవత శ్రీ మంచలమ్మకు చీరను అందజేసి విశేష పూజలతో సమర్పణతో మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీవారి వస్త్రాన్ని స్వామిజీకి అప్పగించారు. శ్రీ స్వామిజీ భక్తితో శ్రీ స్వామి వారి మూల బందావనం వద్ద వస్త్రాన్ని సమర్పించారు. అనంతరం టీటీడీ అధికారులు శ్రీవారి శేషవస్త్రం, ప్రసాదాలను స్వామిజీకి సమర్పించారు. ఈ సందర్భంగా స్వామిజీ శ్రీరామకృష్ణ ను అతని కుటుంబ సభ్యులకు ఆశీర్వదించారు, వారిని శేషవస్త్రం, మెమెంటో మరియు ఫల మంత్రాక్షతలు అందజేసి సత్కరించారు.




# సేవింగ్స్ ఖాతా బ్యాలెన్స్ రూ.50వేలు

## ఐసిఐసిఐ బ్యాంక్ నిర్ణయం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 9 :** ప్రైవేట్ రంగానికి చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ తన సేవింగ్స్ ఖాతాల కనీస సగటు– బ్యాలన్స్ నిబంధనల్లో భారీ పెంపు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ మార్పు మెట్రో, అర్బన్, సెమీ–అర్బన్, గ్రామీణ బ్రాంచ్‌ల ఖాతాదారులందరిపై ప్రభావం చూపనుంది. ఈ పెంపుతో దేశీయ బ్యాంకులలో అత్యధిక 'కనీస సగటు– బ్యాలన్స్' ఐసీఐసీఐ బ్యాంక్‌దే అవుతోంది. కొత్తగా సవరించిన నిబంధనల ప్రకారం.. మెట్రో, అర్బన్ ప్రాంతాల ఖాతాదారులు సగటున 50,000 కనీస నిల్వ ఉంచాలి. ఇది ఇంతకుముందు ఉన్న 10,000 నుంచి 50,000 కు పెరగడంతో.. ఐదు రెట్లు పెరిగినట్టే. సెమీ–అర్బన్ బ్రాంచ్‌లలో కనీస బ్యాలెన్స్ 5,000 నుంచి 25,000కు పెరిగింది. అలాగే గ్రామీణ బ్రాంచ్‌లలో మాత్రం 2,500 నుంచి 10,000కు పెంచారు. ఇకపోతే, దేశంలోనే అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2020లోనే మినిమమ్ బ్యాలెన్స్ నిబంధనను పూర్తిగా రద్దు చేసింది. ఇతర బ్యాంకులు సాధారణంగా 2,000 నుంచి 10,000 వరకు మాత్రమే ఉంచేలా నిబంధనలు అమలు చేస్తుంటాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మెట్రో, అర్బన్‌లో 10,000, సెమీ–అర్బన్‌లో 5,000, గ్రామీణ బ్రాంచ్‌లలో 2,500గా ఉంచింది. బ్యాంకులు తమ రోజువారీ కార్యకలాపాలు, పెట్టుబడుల ఖర్చులను తీర్చుకునేందుకు మినిమమ్ బ్యాలెన్స్ నిబంధనలను అమలు చేస్తాయి. ఈ పరిమితి కంటే తక్కువ నిల్వ ఉంచిన ఖాతాదారులపై జరిమానాలు కూడా వేస్తుంటాయి. ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ఆగస్టు 1 నుంచి కొత్త నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత సవరించిన ఫీజు చార్ట్ ప్రకారం జరిమానాలు విధించనుంది.



## ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### కేక్ కట్ చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** వలిగొండ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు 65 వ యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశానుసారం వలిగొండ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బత్తిని నగేష్,నారి శ్రీకాంత్, మాజీ ఎంపీపీ నూతి రమేష్, మండల అధ్యక్షులు సత్తిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కిష్టయ్య, లింగయ్య, సహాదేవ్,సతీష్, ఉపేందర్ బోస్, అశోక్, యాదగిరి, బాలరాజు, భాస్కర్, వేంకన్న, మల్లేష్, వెంకటేష్, బాలస్వామి, పరందాములు, శంకర్, శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.



### మంత్రి కోమటిరెడ్డి కి, ఎమ్మెల్యే కుంభంకు

## రాఖీ కట్టిన వాకిటి పద్మ

**వలిగొండ రాజముద్ర న్యూస్:** రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని వలిగొండ మాజీ జడ్పిటిసి వాకిటి పద్మ, డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వారి స్వగృహంలో రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అని తెలియజేశారు.



### అసాంఘిక కార్యక్రమాలకు

## పాల్పడితే కఠిన చర్యలు

### సూర్యాపేట డిఎస్పి ప్రసన్న కుమార్

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డిఎస్పి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా వ్యభిచారం.జూదం లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు,పట్టణం లోని ఆర్వి హాస్పిటల్ పక్కన శ్రీశ్రీ నగర్ లో కొందరు వ్యక్తులు నామ సైదులు అనే వ్యక్తి ఇంటిని స్థావరంగా చేసుకొని జూదం ఆడుతున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు,6 గురిని అరెస్టు చేసినట్లు వారి వద్ద నుండి 42 వేల నగదు నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు జిల్లాలో ఎవరైనా బహిరంగంగా మద్యపానం చేసిన, జూదం, వ్యభిచారం,రాత్రి వేళల్లో ఆకతాయిలో పట్ల పోలీసులు ప్రత్యేక నిఘ ఉంచినట్లు తెలియజేశారు.



### బంధాలు గుర్తుండేలా జరుపుకునేదే

## రాఖీ పండుగ : సంతోష్ రాజ్

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** బంధాలు గుర్తుండేలా ఒకరికొకరు కష్టసుఖాల్లో తోడునీడగా ఉండాలని అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగను జరుపుకుంటున్నామని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సంతోష్ రాజ్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బంధాలను ఎప్పుడు మరువద్దని



డబ్బు హెూదా వచ్చాక బంధాలను మరిచేవారు ఎంతోమంది సమాజంలో ఉన్నారని అలాంటివారు బంధాలకు విలువలు ఇవ్వాలని అన్నా చెల్లెల అనుబంధానికి ఏ హెూదా అడ్డు రాదని ఏ స్థాయిలో ఉన్నా మనము బంధాలను మరువద్దని ఈ సందర్భంగా సంతోష్ రాజ్ అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో చెల్లెలు రాజ్యలక్ష్మి తో సాంప్రదాయ బద్ధంగా రాఖీని కట్టించుకున్నారు. ఈ కార్యక్రమంలో భాస్కరిని నరేందర్ రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### యూరియా సరఫరాలో

## అవాంతరాలు తొలగించాలి

### రైతు సంఘం ఆధ్వర్యంలో చెన్నూరులో రాస్తారోకో

**కల్లూరు, ఆగస్ట్ 09:** ఖరీఫ్ సీజన్‌లో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో చెన్నూరులో రాస్తారోకో నిర్వహించారు. సహకార సంఘాలు యూరియా సరఫరా సమయంలో పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు తప్పనిసరి చేయడం తగదని నాయకులు విమర్శించారు.జిల్లా నాయకుడు మాదల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ,కేంద్రం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు,వారి కుటుంబ సభ్యులు పొలాలు వదిలి ఎరువుల కోసం క్యూల్లో నిలబడే పరిస్థితి ఏర్పడిందన్నారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత జిల్లాలోనే ఈ పరిస్థితి రావడం విచారకరమని అన్నారు.ఖమ్మం జిల్లాలో 7,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైందికాని,కేవలం 4,500 మెట్రిక్ టన్నులు మాత్రమే అందించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కౌలు రైతులకు కూడా యూరియా అందించాలనీ, నెలకు ఒక్కసారి మాత్రమే ఇవ్వడం సరికాదని స్పష్టం చేశారు.ప్రైవేట్ ఎరువుల దుకాణాలకు యూరి



యా సరఫరా విధానం మార్చాలని డిమాండ్ చేశారు.సాగర్ ఆయకట్టు,చెరువుల పరిధిలో వరి సాగు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఎరువులు సరఫరాలో కోతలు లేకుండా ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రావూరి వెంకటేశ్వరరావు,ఆళ్ల శ్రీకాంత్, దంతాల లక్ష్మయ్య,నల్లమాటి రామకృష్ణ,మాదల భద్రయ్య, గింజుపల్లి అర్జున రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి హక్కుల పోరాట యోధుడు కొమరం భీమ్

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా
- సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం

**కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 9:** ఆదివాసీల హక్కుల పోరాట యోధుడు కొమరం భీం అని, ఆదివాసీల సంక్షేమం, వారి అభ్యున్నతికోసం తన తుదిశ్వాసవరకు పోరాడిన యోధుడు భీం అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ, తెలంగాణ గిరిజన సమాఖ్య, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం సిపిఐ జిల్లా కార్యా లయంలో కొమరంభీం చిత్రపటానికి పూలమాల వేసి నివా ళు లర్పించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ ఆదివాసీల జీవన విధానాన్ని గుర్తించి వారి అభ్యున్నతికోసం పాలకులు కృషి చేయాలనే ఉద్దేశంతోనే ఐక్యరాజ్య సమితి ఆగష్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించిందని గుర్తుచేశారు. కొమరంభీం, మల్లుదొర, సమ్మక్క, సారక్క లాంటి ఎందరో ఆదివాసీ నాయకులు రాజంగం కల్పించిన చట్టాల, ఆదివాసీ హక్కుల అమలు కోసం ప్రాణత్యాగాలు చేశారని, పాలకుల నిర్లక్ష్యం కారణం



గా ఇప్పటికి ఆదివాసీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని అన్నారు. జల్ జంగల్ జమీన్లపై ఆదివాసీలకే సంపూర్ణ హక్కులు ఉన్నాయని, ఆదిలాబాద్ జిల్లా జోడేఘాట్ కేంద్రంగా ఆదివాసీ ప్రజలను కూడగట్టి నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి అమరుడైన ధీరుడు కొమరం భీం అని అయన సేవలను కొనియాడారు. ప్రపంచ వ్యాపితంగా ఆదివాసీలు ఇంకా అన్ని రంగాల్లో వెనుకబడి వున్నారని దీనికి పాలకుల నేరపూరిత నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ఆదివాసీలు కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. భీం పోరాట స్ఫూర్తిని కొనసాగించి గిరిజన చట్టాల అమలు, పరిరక్షణకోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## వ్యాపారం దినదిన అభివృద్ధి కావాలి

### మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్

**రంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 9 :** స్వతహాగా తన కాళ్లపై తానే నిలబడి వ్యాపారం చేసుకోవాలని లక్ష్యంతో కే మహేందర్ రెడ్డి నూతనంగా ఏర్పాటుచేసిన కారం దోశ ( రాజు గారి కారం దోశ ) వ్యాపారం దిన దిన ప్రవర్ధ మా నం కావాలని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు, భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. శనివారం నాడు మీర్పేటలో ఏర్పాటుచేసిన కారం దోష హెూటల్లో ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుతున్నానని అదే విధంగా నూతనంగా షాపు ఓపెన్ చేసిన మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. కాంటెస్ట్ ఎమ్మెల్యే అందేలా శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ను ప్రభుత్వం పట్టించుకోని ఇబ్బందులు పెడుతున్న నేపథ్యంలో సొంతంగా బిజినెస్ ఏర్పాటు చేసుకొని పదిమందికి సహాయం చేస్తూ మనం కూడా పైకి ఎదగడం యువత అంతా ఇలాంటి బిజినెస్ చేసుకోవాలని మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో బీర్పేట భారతీయ జనతా పార్టీ



అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి బిజెపి రాష్ట్ర నాయకులు కొలను శంకర్ రెడ్డి జంగయ్య యాదవ్ మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్ ప్రధాన కార్యదర్శి కౌడి మహేందర్ కోడూరు సోమేశ్వర్ మీర్పేట భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి రవి నాయక్ శ్రీనివాస్ కే లతాశ్రీ సేవాశ్రమం నీలా రవి నాయక్ తూల ప్రభాకర్ వేణుగోపాల్ రెడ్డి చిల్లంపల్లి రాజశేఖర్ మన్యం రవీందర్ రెడ్డి ముఖేష్ ముదిరాజ్ మల్లికార్జున్ దామోదర్ రెడ్డి ప్రసాద్ కోట్ల గోపాల్ భాస్కర్ అరవింద్ వెంకన్న పాల్గొన్నారు.

## మినీ గురుకుల పాఠశాలలో బాలికలతో సందడి

### మాజీ జెడ్పి చైర్మన్ కొడగల్ యాదయ్య

**జడ్చర్ల ప్రతినిధి, ఆగస్టు 9:** రాజాపూర్ పోచమ్మ గడ్డ దగ్గర ఉన్న ఎస్టీ బాలికల మినీ గురుకుల పాఠశాల విద్యార్థిని విద్యార్థులు మాజీ జడ్పీ చైర్మన్ కొడగల్ యాదయ్య కు రాఖీలు కట్టి ఆశీస్సులు అడిగారు. అనం తరం యాదయ్య బాలబాలికలు అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి నాయక్ మహేష్ నాయక్ వెంకటేష్ జి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



### అన్నా చెల్లెళ్ల ఆత్మీయ బంధానికి

## ప్రతీక రాఖీ పౌర్ణమి

- మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డికి రాఖీ కట్టిన సోదరీమణులు, 25వ డివిజన్ మహిళామణులు

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** స్నేహం, సోదరభావం, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పీర్జాదిగూడ 25వ డివిజన్‌లో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డికి సోదరీమణులు ప్రేమతో రాఖీ కట్టి, ఆయురారోగ్యాలతో సుఖశాంతులు కలగాలని, మిఠాయిలు తినిపించి పండుగ వాతావరణాన్ని మరింత అందంగా





మార్చారు. మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ ... "సమాజంలో స్త్రీల భద్రత, గౌరవం కోసం ప్రతి అన్నదమ్ముడు ముందుండాలని, సోదరభావం మన సంస్కృతిలో అపారమైన విలువ కలిగినది. ఈ బంధాన్ని ఎప్పటికీ కాపాడుకోవాలి" అని పిలుపునిచ్చారు. మహిళలు మాట్లాడుతూ... రాఖీ కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా, అన్నా–చెల్లెళ్ల, అక్క – తమ్ముళ్ల మధ్య ఉన్న అబద్ధం లేని ప్రేమ, నమ్మకం, రక్షణ బంధానికి సంకేతమని తెలిపారు. సోదరులు సోదరీమణుల భద్రత, గౌరవం కాపాడే వాగ్దానం చేసే రోజే రాఖీ పౌర్ణమి అని పేర్కొన్నారు.



## ఘనంగా హీరో మహేష్ జన్మదిన వేడుకలు

- అన్నదానం, వస్త్ర ధానం, ప్లాంటేషన్, పలు దేవాలయాల్లో పూజలు
- అభిమాన సంఘాల దాతృత్వం

**ఖమ్మం టౌన్, ఆగష్టు 9 :** సినీ హీరో మహేష్ బాబు 50వ జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో మహా అన్నదాన కార్యక్రమం చేశారు, ముందుగా పలు దేవాలయాల్లో మహేష్ బాబు పేరు మీద పూజలు చేసి బాబు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆ దేవుళ్లను వేడుకున్నారు. అనంతరం మహేష్ బాబు పుట్టినరోజు కేకును కట్ చేసి అభిమానులకు మిఠాయిలు పంచారు . అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షులు తోట రంగారావు – దమయంతి ఆధ్వర్యంలో 3 టౌన్ లో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ బాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 9 తారీకు మాకు పండుగ రోజు, ఈరోజు కోసం మేమంతా ఎదురు చూస్తామని జిల్లా వ్యాప్తంగా అభిమానులు అందరు కూడా మహేష్ బాబు పుట్టిన రోజుని పండుగ లాగా జరుపుకుంటూ ప్రజలకు ఉపయోగపడే సామాజిక సేవ కార్యక్రమాలు ఎన్నో చేయడం జరుగుతుందని తెలిపారు. దీనికి ప్రధానంగా మా ఘట్టమనేని కుటుంబమే కారణమని అన్నారు.మహేష్ బాబు ఇప్పటివరకు సుమారు 3500 మంది పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించినారని ఎక్కడ వారి దానగుణం చెప్పుకోవడం జరగలేదని వారు చేసే దాన ధర్మాల్లో మేము చేసేది చాలా చిన్నదే అయినప్పటికీ వారి బాటలో ప్రయాణిస్తూ ప్రతి సంవత్సరం ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడే అనేక రకాల కార్యక్రమాలు జరుపుకుంటూ పోతామని అన్నారు . ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మునగాల బాలు సత్తుపల్లి నుంచి కే వెంకటేశ్వరరావు ఖమ్మం నగర గౌరవ అధ్యక్షులు నాగర్జునపు బ్రహ్మం పులిపాటి సంపత్ గౌతమ్ బుర్రి మోహన్ రావు ఎన్ వెంకన్న జి సుధాకర్ చింతమల్ల గురుమూర్తి ఏనుగు మహేష్ బ్రహ్మం ఊటుకూరి కృష్ణ వి వి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవ వేడుకలు

**ఖమ్మం అర్బన్, ఆగష్టు 9:** ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవం సందర్భంగా గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియం దగ్గర నుండి గిరిజన భవనం వరకు బంజారా సాంప్రదాయాలతో , డిజె సౌండ్ తో , బంజారా నృత్య ప్రదర్శన చేసుకుంటూ భారీ ర్యాలీని నిర్వహించారు . గిరిజన భవనంలో ఐటీడీఏ ఏర్పాటు చేసిన సభలో డిడి విజయలక్ష్మి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మహనీయుల చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు . ఈ సందర్భంగా సేవాలాల్ సేన జాతీయ నాయకులు బానోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పాలకుల తీరు ఉందని దీనికి రేవంత్ సర్కారే నిదర్శనం అన్నారు . తెల్ల వెంకట్రావు సుప్రీం కోర్టులో కేసు వేయించారని , లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకుండా అడ్డుపడుతూ అలాగే పోడు భూమి పట్టాలు ఇవ్వకుండా మైదానం ప్రాంతంలో గిరిజనులకు ఐటీడీఏలు ఏర్పాటు చేయకుండా , తమ పంచాయతీ ఎన్నికలు జరపకుండా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో ఏఐబిఎస్ఎస్ అధ్యక్షులు ధరావత్ రామ్మూర్తి , గిరిజన సమైక్య అధ్యక్షులు ఏ రామ్మూర్తి , ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు బిక్షపతి రాథోడ్ , టిటిఎఫ్ అధ్యక్షులు మంగ్య, శోభన్ , రాంబాబు, హరి నాయక్ జగన్ బోడ రమేష్ కిషన్ నాయక్ రవి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు .

## సీశాబ్ తొలి విడత సీట్ల కేటాయింపు

**హైదరాబాద్:** దేశవ్యాప్తంగా ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు తదితర విద్యాసంస్థల్లో తొలి విడత సీట్లను సెంట్రల్ సీట్ అలకేషన్ బోర్డు (సీశా బ్) శనివారం కేటాయిం చింది. జోసా కౌన్సెలింగ్ తర్వాత దాదాపు 13,727 సీట్లు మిగిలిపోయాయి. అందులో ఎన్ఐటీల్లో 4,500, ట్రిపుల్ ఐటీల్లో 3 వేల వరకు ఉండగా.. మిగిలినవి స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ (స్పా), కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే ఇతర సాంకేతిక విద్యా సంస్థల్లో ఉన్నాయి. వాటిని భర్తీ చేసేందుకు సీశాబ్ మూడు విడతల కౌన్సెలింగ్ నిర్వహిస్తోంది. ఈ మేరకు తొలి విడతలో అన్ని సీట్లను కేటాయించినట్లు తెలుస్తోం ది. విదేశీయులకు, ప్రవాస భారతీయులకు, ఓసీఐ పౌరసత్వం ఉన్నవారికి డైరెక్ట్ అడ్మిషన్ ఆఫ్ స్టూడెంట్స్ అబ్రాడ్(దాసా) పేరిట సీట్లు కేటాయిస్తారు. ఆ కోటాలో 1,595 మంది దరఖాస్తు చేసుకోగా 1,51 5 మందికి సీట్లు కేటాయిం చామని సీశాబ్ ఛైర్మన్, ఎన్ఐటీ రవుర్కెలా డైరెక్టర్ ఆచార్య ఉమామహే శ్వర్‌రావు తెలిపారు.

### రైతు బీమా కోసం రైతులు

## దరఖాస్తు చేసుకోవాలి

### మండల వ్యవసాయ అధికారి అంజనీ దేవి

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకొని రైతులు ఎవరైనా ఈనెల 13వ తేదీ లోపు వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవా లని మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి ఒక ప్రకటనలో తెలియజేశారు. దీని కోసం1966–2007 మధ్య జన్మించిన రైతులకు మాత్రమే ఇది వర్తింపజే స్తుందని, అదేవిధంగా అలాగే పుట్టిన తేదీ ఆధార్ ప్రకారం పరిగణలోకి వస్తుందని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి రైతు పట్టాదార్ పాస్బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు



జిరాక్స్ నామిని ఆధార్ జిరాక్స్ ఇవ్వవలసి ఉంటుందని ఆయన తెలిపారు. అదేవిధంగా ఇంతకుముందు చేసుకున్న రైతులు సవరణలు చేసుకోవడానికి కూడా సంబంధిత పత్రాలతో ఏఈఓ లను సంప్రదించవచ్చునని అని అన్నారు.



## త్వరలో ట్రంప్-పుతిన్ భేటీ.. స్వాగతించిన భారత్

**న్యూఢిల్లీ :** రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. పుతిన్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధమయ్యారు. అలస్కా వేదికగా వీరు సమావేశం కానున్నారు. ఈ పరిణామాలపై స్పందించిన భారత్.. సమావేశానికి ఆ రెండు దేశాలు అంగీకరించడాన్ని స్వాగతించింది. "ఆగస్టు 15న అలస్కా వేదికగా అమెరికా, రష్యా అధ్యక్షులు భేటీ అయ్యేందుకు అంగీకరించడాన్ని భారత్ స్వాగతిస్తోంది. ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలికేందుకు ఇదో అవకాశంగా భావిస్తున్నాం. ఇది యుద్ధాల శకం కాదని ప్రధాని మోదీ పలు సందర్భాల్లో చెప్పారు" అని పేర్కొంటూ భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ దౌత్య ప్రయత్నాలకు భారత్ నుంచి పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. అమెరికాలో పుతిన్ పర్యటించడం 2015 తర్వాత ఇదే తొలిసారి. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో అప్పట్లో ఆయన భేటీ అయ్యారు. పదేళ్లలో తొలిసారి అమెరికాలో పర్యటించనుండగా.. రష్యా అధ్యక్ష కార్యాలయం దీనిని ధ్రువీకరించింది. ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కోసం ఉన్న అవకాశాలను చర్చించడంపై దృష్టి పెట్టామని, ఈ ప్రక్రియ సవాళ్లతో కూడుకున్నదని తెలిపింది. అయినప్పటికీ దీనిపై మాస్కో క్రియాశీలంగా పనిచేస్తోందని పేర్కొంది.

## ట్రంప్-పుతిన్ భేటీకి కొన్ని దేశాలు అడ్డుపుల్ల - రష్యా

**రష్యా :** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు ప్రయత్నాలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. త్వరలోనే పుతిన్‌తో భేటీ కానున్నారు. అలస్కా వేదికగా ఇది జరగనుందని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. ఈ క్రమంలో స్పందించిన రష్యా.. వీరి భేటీకి అంతరాయం కలిగించేందుకు కొన్ని దేశాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని పేర్కొంది. ఇందుకోసం రెచ్చగొట్టే ప్రకటనలు, తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపించింది. "యుద్ధం కొనసాగింపును కోరుకునే దేశాలు పుతిన్-ట్రంప్ సమావేశానికి అంతరాయం కలిగించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయనడంలో సందేహం లేదు. కొన్ని దేశాలు రెచ్చగొట్టే ప్రకటనలు, తప్పుడు సమాచార వ్యాప్తికి పాల్పడుతున్నాయి" అని రష్యన్ డైరెక్ట్ ఇన్వెస్టిమెంట్ ఫండ్ సీఈవో కిరిల్ దిమిత్రివ్ పేర్కొన్నారు. అయితే, ఏయే దేశాలు, ఎటువంటి ప్రకటనలు చేస్తున్నాయన్న విషయంపై మాత్రం ఆయన స్పష్టత ఇవ్వలేదు. రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగేలా ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్.. పుతిన్‌తో చర్చలకు సిద్ధమయ్యారు. ఈ శాంతి ఒప్పందంలో భూభాగాల మార్పిడి ఉంటుందనే సంకేతాలివ్వగా.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాత్రం భూభాగాన్ని వదులుకోమని చెబుతున్నారు. మరోవైపు పుతిన్, ట్రంప్‌ల భేటీని క్రెమ్లిన్ కూడా ధ్రువీకరించింది. దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారంపై దృష్టి సారించామని తెలిపింది.



## శాంతి కోసం భూభాగాన్ని వదులుకోం

### ట్రంప్ వ్యాఖ్యలపై జెలెన్‌స్కీ మండిపాటు


**ఉక్రెయిన్ :** మూడున్నరేళ్లకు పైగా కొనసాగుతోన్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెర పడేలా చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే వచ్చేవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీకి సిద్ధమవుతున్న ఆయన.. శాంతి ఒప్పందంలో భూభాగాల మార్పిడి ఉంటుందనే సంకేతాలిచ్చారు. అయితే దీన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తోసిపుచ్చారు. శాంతి కోసం భూభాగాన్ని వదులుకోబోమని తేల్చిచెప్పారు. ఆగస్టు 15న అలస్కా వేదికగా పుతిన్‌తో భేటీ కానున్నట్లు ట్రంప్ తన ట్రూత్ ఖాతాలో వెల్లడించారు. దీనిపై తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదురుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. "అందుకు (శాంతి ఒప్పందం కోసం) కొన్ని భూభాగాలు వెనక్కి తీసుకోవడం, మార్చుకోవడం జరుగుతుంది. ఇరుపక్షాలకు మేలు జరిగేలా ఈ భూభాగాల మార్పిడి ఉంటుంది" అని ట్రంప్ వెల్లడించారు. అయితే, ఏయే ప్రాంతాలను మార్చుకుంటారు? ఎవరు ఏ భూభాగాలను తీసుకుంటారు? అనే వివరాలను ఆయన చెప్పలేదు. వాస్తవానికి అలస్కాలో పుతిన్, జెలెన్‌స్కీతో త్రైపాక్షిక భేటీ నిర్వహించాలని ట్రంప్ భావించారు. ఇటీవల యూఎస్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ రష్యా పర్యటన సమయంలోనూ ఇదే విషయాన్ని ప్రతిపాదించారు. కానీ, దీనిపై క్రెమ్లిన్ నుంచి ఏ స్పందన రాలేదని సమాచారం. దీంతో తొలుత పుతిన్‌తో ద్వైపాక్షిక భేటీ జరిపి కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పించాలని ట్రంప్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

### అవి ఫలితం లేని చర్చలే : జెలెన్‌స్కీ

ట్రంప్-పుతిన్ భేటీ వార్తలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతను దెబ్బతీసే చర్చలను ఆమోదించబోం. శాంతి స్థాపన కోసం నిర్వహించే సమావేశాల్లో మా గళాన్ని వినిపించాల్సిందే. అంతేగానీ, ఆక్రమణదారులకు ఉదారంగా మా భూభాగాన్ని వదులుకోలేం. ఉక్రెయిన్ లేకుండా జరిపే చర్చల్లో ఏ పరిష్కారాలు నిర్ణయించినా అవన్నీ శాంతికి వ్యతిరేకమే. వాటితో సమస్య తీరదు. ఆ నిర్జీవ పరిష్కారాలు ఏమాత్రం పనిచేయవు" అని జెలెన్‌స్కీ మండిపడ్డారు.

# భారత విమానాలకు గగనతలం మూసివేత

### పాక్‌కు రూ.126 కోట్ల నష్టం



**పాకిస్థాన్ :** జమ్మూకశ్మీర్‌లో పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో భారత విమానాలు తమ గగనతలం మీదుగా వెళ్లకుండా పాకిస్థాన్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ నిర్ణయంతో దాయాదికే భారీ నష్టం ఎదురైంది. దీని వల్ల పొరుగు దేశానికి దాదాపు రూ.126 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పాక్ రక్షణ మంత్రిత్వశాఖ అసెంబ్లీలో సమర్పించిన నివేదికలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయని పలు మీడియా కథనాలు వెలువడుతున్నాయి. ఏప్రిల్ 24 నుంచి జూన్ 20 వరకు పాక్ తమ గగనతలాన్ని మూసివేయడంతో 4.10 బిలియన్ల పాక్ రూపాయలు(భారత కరెన్సీలో దాదాపు రూ.126 కోట్లు) నష్టం వాటిల్లిందని పాక్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ పేర్కొన్నట్లు తెలుస్తోంది. భారతపై ఆంక్షల నేపథ్యంలో రోజుకు 100-150 విమానాలపై ప్రభావం పడిందని తెలిపింది. దీని కారణంగా విమానాల రాకపోకలు 20శాతం తగ్గిపోయాయని వెల్లడించింది. ఫలితంగా పాక్ గగనతలాన్ని వినియోగించుకు న్నందుకు భారత విమానాలపై విధించే ఛార్జీలపై వచ్చే ఆదాయంపై తీవ్ర ప్రభావం పడినట్లు వివరించింది. ఎ ఉగ్రదాడి అనంతరం చోటుచేసుకున్న దౌత్యపరమైన ఉద్రిక్తతల్లో భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో.. తాము గగనతలాన్ని మూసివేసిన విషయాన్ని గుర్తుచేసింది. ఈ ఆంక్షలను ఆగస్టు 24 వరకు పొడిగించారు. దీనికి ప్రతిగా భారత్ కూడా పాక్ విమానాలకు తమ గగనతలాన్ని మూసివేసింది. పహల్గాంలో ఉగ్రదాడి ఘటనపై దేశమంతా ఆందోళన వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఉగ్రవాదులను పోషిస్తున్న పాక్‌పై భారత్ కఠిన చర్యలు తీసుకుంది. అందులోభాగంగా సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతోపాటు పాక్ పౌరులు తక్షణమే భారత్‌ను విడిచివెళ్లాలని ఆదేశించింది. అనంతరం భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి.. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది.

## ఢిల్లీలో గోడ కూలి ఎనిమిది మంది మృతి



**న్యూఢిల్లీ :** అకస్మాత్తుగా గోడ కూలడంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన ఢిల్లీలోని జైత్‌పూర్‌లోని హరినగర్‌లో చోటుచేసుకుంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఓ ఇంటి గోడ కూలినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు బాలికలు ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళాలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను షబీబుల్ (30), రబీబుల్ (30), అలీ (45), రుబీనా (25), డాలీ (25), రుఖ్సానా (6), హసీనా (7)గా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. కూలిపోయే స్థితిలో ఉన్న నివాసాలలో ఉండొద్దని అధికారులు సూచించారు. దేశ రాజధానిలో నిన్న రాత్రి నుంచి కురుస్తున్న కుంభవృష్టితో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు నదులను తలపిస్తున్నాయి. శనివారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరోవైపు వర్షాల నేపథ్యంలో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. 200లకు పైగా విమానాలు ఆలస్యమయ్యాయి. వర్షాల నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టు అడ్వైజరీ జారీ చేసింది. విమాన సర్వీసులకు సంబంధించి ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ తమ ఎయిర్‌లైన్ల నుంచి తాజా సమాచారం తెలుసుకోవాలని సూచించింది.

## తెలంగాణలో ఎన్‌టిపిసి 80వేల కోట్ల పెట్టుబడి

**హైదరాబాద్ :** తెలంగాణకు ఎన్‌టిపిసిపెద్ద గుడ్ న్యూస్ చెప్పింది. విద్యుత్ ఉత్పత్తి రంగంలో దేశంలోనే అగ్రగామి అయిన ఎన్టీపీసీ.. తెలంగాణ రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు సన్నద్ధమైంది. సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గురుదీప్ సింగ్ నాయకత్వంలోని ప్రతినిధుల బృందం సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ నివాసంలో జరిగిన ఈ భేటీలో తమ భవిష్యత్ ప్రణాళికలను సింగ్ వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులపై దాదాపు రూ.80,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఎన్టీపీసీ తెలిపింది. ముఖ్యంగా ఫ్లోటింగ్ సోలార్ ద్వారా తెలంగాణలో సుమారు 6,700 మెగావాట్ల ఉత్పత్తి సాధ్యమని సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ తరహా ప్రాజెక్టులు రాష్ట్రానికి శక్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా.. పర్యావరణ పరిరక్షణతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ఎన్టీపీసీ స్పష్టం చేసింది. భూమి వినియోగం లేకుండా విద్యుత్ ఉత్పత్తి వంటి అనేక లాభాలను ఈ తరహా ప్రాజెక్టు లు అందిస్తాయని ముఖ్యమంత్రికి ఎన్టీపీసీ ప్రతినిధులు వివరించారు. పెరుగుతు న్న విద్యుత్ అవసరాలను తీర్చడంలో థర్మల్, జల విద్యుత్ ఉత్పత్తిపై ఆధారపడుతున్న తెలంగాణకు, ఈ పునరుత్పాదక ఇంధన పెట్టుబడులు కీలక మలుపు అవుతాయని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ ప్రతిపాదనకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి ఎన్టీపీసీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని పెద్ద రిజర్వాయర్లు, జలాశయాలు సోలార్ ప్రాజెక్టులకు అనువైన వనరులుగా మారనున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

## అంతర్జాతీయ స్థాయికి అరకు కాఫీ

- రబ్బరు, కాఫీ సాగు విస్తరణకు అడుగులు
- బ్రాండింగ్ బాధ్యతలు స్వీకరించిన టాటా
- గిరిజన అభివృద్ధి లక్ష్యంగా ముందడుగు
- ఏజెన్సీలో ఓయో హెూమ్‌స్టేల ఏర్పాటు
- ఐటీడీఏలతో బోర్డుల ఒప్పందం




**అమరావతి, ఆగస్టు 9 :** ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అరకు కాఫీకి మరింత బ్రాండ్ ఇమేజ్ తీసుకురావడమే కాకుండా, ఆదివాసీల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించే దిశగా పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకుంది. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాడేరులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో మొత్తం 21 ఒప్పందాలు జరిగాయి. వీటిలో అత్యంత కీలకమైనది, ప్రముఖ కార్పొరేట్ దిగ్గజం టాటా కన్స్యూమర్స్ సంస్థతో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చేసుకున్న ఒప్పందం. ఈ ఒప్పందం ద్వారా ఆర్గానిక్ అరకు కాఫీని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను టాటా స్వీకరించనుంది. ఇది అరకు కాఫీ ఖ్యాతిని కొత్త శిఖరాలకు చేర్చగలదని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, కాఫీ సాగును ప్రోత్సహించేందుకు ఐటీసీ సంస్థ పాడేరు ఐటీడీఏతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే 4,010 హెక్టార్లలో కాఫీ సాగు చేస్తున్న ఐటీసీ, అదనంగా మరో 1,600 హెక్టార్లలో సాగును విస్తరించనుంది. గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించి, స్థానికులకు ఉపాధి కల్పించేందుకు ప్రముఖ హాస్పిటాలిటీ సంస్థలు ఓయో హెూమ్స్, హెూమీ హట్స్ ముందుకొచ్చాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో హెూమ్‌స్టేల అభివృద్ధి, నిర్వహణ కోసం ఈ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. దీని ద్వారా పర్యాటకులకు మెరుగైన వసతి సౌకర్యాలు లభించడంతో పాటు గిరిజనులకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. ఏపీ గిరిజనోత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు పరిచయం చేసే లక్ష్యంతో అమెరికాకు చెందిన హాతీ సర్వీసెస్ ఎల్ఎల్‌సీ సంస్థతో జీసీసీ ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా అమెరికాలో జీసీసీ రిటైల్ కార్యకలాపాలు ప్రారంభించనుంది. దేశవ్యాప్తంగా గిరిజన ఉత్పత్తుల విక్రయానికి ట్రైఫెడ్‌తో కలిసి జీసీసీ రిటైల్ షోరూమ్‌లను ఏర్పాటు చేయనుంది. ఇవే కాకుండా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో రబ్బరు సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర రబ్బరు బోర్డు, చింతపల్లిలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సబ్ కో సంస్థ, పసుపు ప్రాసెసింగ్ కోసం ఎక్విప్ సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందాలన్నీ గిరిజనులకు జీవనోపాధి అవకాశాలు మెరుగుపరచడం, వారి ఉత్పత్తులకు సరైన ధర కల్పించడం, పర్యాటక రంగం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా జరిగాయి.



## ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో విమాన సేవలకు అంతరాయం

**ముంబయి :** ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషనల్ ఎయిర్-పోర్ట్‌లో విమాన సేవలకు శనివారం అంతరాయం ఏర్పడింది. నెట్‌వర్క్ విఫలమవ్వడంతో చెక్-ఇన్ వ్యవస్థలో అంతరాయం తలెత్తింది. సేవలు సాధారణ స్థితికి వచ్చినప్పటికీ పలు విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఎయిరిండియా సహా పలు విమాన సర్వీసులు ప్రభావితం అయ్యాయి. థర్డ్ పార్టీ డేటా నెట్‌వర్క్‌లో అంతరాయం కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందంటూ ఎయిరిండియా ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. సమస్య పరిష్కారమైనా విమానాలు ఆలస్యంగా బయల్దేరుతున్నాయని పేర్కొంది. విమానాశ్రయానికి వెళ్లే ముందు విమాన స్టేటస్‌ను చెక్ చేసుకావాలని ప్రయాణికులకు సూచించింది. వారాంతం, రక్షాబంధన్ పండుగ కావడంతో విమానాశ్రయం ప్రయాణికులతో కిక్కిరిసింది. మరోవైపు వర్షం కారణంగా ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దాదాపు 300లకు పైగా విమానాలు ఆలస్యంగా బయలుదేరాయి. ఏ ఒక్క విమానాన్నీ దారి మళ్లించలేదని అధికారులు పేర్కొన్నారు. ఫ్లైట్ రాడార్ ప్రకారం ఢిల్లీ విమానాశ్రయంలో రోజుకు 1,300 విమానాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. సగటున 17 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతున్నాయని విమానాశ్రయ అధికారులు పేర్కొన్నారు.



## భారత రక్షణ రంగ ఉత్పత్తులు @రూ.1.51 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ :** దేశీయంగా రక్షణ ఉత్పత్తులు ఇటీవల గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ ఉత్పత్తుల విలువ రూ.1,50,590 కోట్లకు చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే 18శాతం వృద్ధి కనిపించగా.. ఐదేళ్లలోనే 90శాతం వృద్ధి నమోదైందని చెప్పారు. "2024-25 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.5లక్షల కోట్లకు చేరుకొని ఆల్‌టైమ్ రికార్డు సాధించింది. గతేడాది 1.27లక్షల కోట్లుగా ఉండగా.. ప్రస్తుతం 18శాతం వృద్ధి నమోదు చేసుకుంది. 2019-20లో రూ.79వేల కోట్లు విలువైన ఉత్పత్తులు నమోదు కాగా ఇప్పుడది 90శాతం పెరిగింది" అని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. డీఆర్‌డీవో, రక్షణ రంగ విభాగాలు సహా అన్ని భాగస్వామ్యపక్షాల సమష్టి కృషి ఫలితంగా ఈ ఘనత సాధ్యమైందన్నారు. మొత్తం ఉత్పత్తుల్లో డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ (డీపీఎస్‌యూ)తో పాటు ఇతర పీఎస్‌యూలు 77శాతం తయారు చేయగా, మరో 33శాతంలో ప్రైవేటు రంగం పాత్ర ఉందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. రక్షణ పరికరాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని మన దేశం తగ్గించుకొని, ఆత్మనిర్భరత సాధిస్తుందనడానికి ఇదో నిదర్శనమన్నారు. దేశ అవసరాలను తీర్చడమే కాకుండా, రక్షణ ఉత్పత్తుల ఎగుమతి సామర్థ్యం కూడా భారీగా పెరిగిందన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి..

### బిడ్డ మరణవార్త విని ఆగిన తండ్రి గుండె

**తాళ్లపూడి:** రాఖీ పండగకు వెళ్తూ ఒకరు.. శుభకార్యానికి వెళ్లి తిరిగొస్తూ మరొకరు.. ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఈ క్రమంలోనే తనయుడి మృతి వార్త విన్న తండ్రి గుండెపోటుతో ప్రాణాలు విడిచాడు. ఈ హృదయ విదారక ఘటన తూర్పు గోదావరి జిల్లా, గోపాలపురం మండలం చిట్యాల - వెంకటాయపాలెం రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం మండలం వాదాలకుంటకు చెందిన మరపట్ల సువర్ణరాజు (52) తాళ్లపూడి మండలం బల్లిపాడులో ఓ వివాహ శుభకార్యానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగొస్తున్నారు. పెద్దేవం గ్రామానికి చెందిన గుండేపల్లి వీరవెంకటమణి శంకరం (25) రాఖీ పండుగ సందర్భంగా సోదరీమణుల వద్ద రాఖీ కట్టించుకుని వస్తున్నారు. వెంకటాయపాలెం సమీపంలో ఎదురెదురుగా వీరి వాహనాలు ఢీకొన్నాయి. శంకరానికి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రగాయాలైన సువర్ణరాజును 108 వాహనంలో రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా.. తుదిశ్వాస విడిచారు. మరోవైపు.. రోడ్డు ప్రమాదంలో తనయుడు మృతి చెందాడన్న వార్త తెలిసిన శంకరం తండ్రి శ్రీనువాసు (50) గుండెపోటుతో మృతి చెందారు. పండగపూట ముగ్గురి మృతితో తాళ్లపూడి మండలం పెద్దేవం, గోపాలపురంలోని వాదాలకుంటల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పోకిరీల బెండు తీస్తున్న షీటీమ్స్

**న్యూఢిల్లీ, ఆగస్టు 9 :** ఆడాళ్ల జోలికి వస్తే తోలు తీస్తామంటున్నారు హైదరాబాద్ షీ టీమ్స్. నిత్యం పబ్లిక్ ప్లేసుల్లో మారు వేషాల్లో గస్తీ కాస్తూ ఆకతాయిలను అదుపులోకి తీసుకుంటున్నారు. తాజాగా మహిళలను పబ్లిక్ ప్రదేశాల్లో వేధించిన 33 మందిని సైబరాబాద్ షీ టీమ్స్ అరెస్ట్ చేశాయి. ఆగస్టు 3 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్‌లో ఈ అరెస్టులు జరిగాయి. వివిధ సోర్సుల ద్వారా మహిళల నుంచి వచ్చిన 25 ఫిర్యాదులకు షీ టీమ్స్ తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాయి. అంతే కాకుండా, కాపురంలో విబేధాలతో సతమతం అవుతున్న 21 జంటలకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లలో కూర్చోబెట్టి మాట్లాడి, సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేశారు. జూలై నెలలో మాత్రమే షీ టీమ్స్ 49మందిని అరెస్ట్ చేశారు. 48 పెట్టి కేసులు నమోదు చేసి, అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళా బాధితుల నుంచి 30 ఫిర్యాదులు అందుకుని.. వాటిపై తక్షణ చర్యలు చేపట్టారు. మహిళలు, బాలికల భద్రత కోసం 64 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైబరాబాద్ ఉమెన చిల్డ్రన్ సేఫ్టీ వింగ్‌లో 5 కౌన్సెలింగ్ సెషన్లు కూడా ఏర్పాటు చేశారు. సైబరాబాద్ షీ టీమ్స్ 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ.. మహిళల భద్రత కోసం కట్టుబడి ఉన్నాయని అధికారులు వివరించారు.

# కోహ్లీ ఇచ్చిన కానుకను పదిలంగా దాచుకున్న సిరాజ్

విరాట్ కోహ్లీ, మహ్మద్ సిరాజ్ మధ్య ప్రత్యేక అనుబంధం ఉంది. కోహ్లీ చివరిసారిగా ధరించిన టెస్ట్ జెర్సీని సిరాజ్‌కు కానుకగా ఇచ్చాడు. దాన్ని మహ్మద్ సిరాజ్ పదిలంగా తన ఇంట్లో దాచుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా తర్వాత, సిరాజ్.. టీమ్ఇండియాకు కీలక బౌలర్‌గా మారాడు. తాజాగా ముగిసిన తెందూల్కర్- అండర్సన్ ట్రోఫీలోనూ అయిదు మ్యాచుల్లో 23 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే రెండు సార్లు అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు. ముఖ్యంగా ఈ ట్రోఫీలో భాగంగా ఓవల్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో టీమ్ఇండియా ఆరు పరుగుల తేడాతో గెలిచి, సిరీస్‌ను సమం చేయడంలో.. సిరాజ్ కీలకపాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో అతడు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి తొమ్మిది వికెట్లు తీసుకున్నాడు. ఇప్పటి వరకు 41 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన సిరాజ్ 123 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్ టూర్‌లో టీమ్ఇండియా విజయం సాధించిన తర్వాత విరాట్ కోహ్లీ.. సోషల్ మీడియా వేదికగా సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణను ప్రశంసించాడు. ముఖ్యంగా మహ్మద్ సిరాజ్ అద్భుతంగా రాణించి, టీమ్ఇండియా విజయంలో కీలకపాత్ర పోషించాడని కొనియాడాడు. దానికి సిరాజ్ కూడా స్పందిస్తూ.. విరాట్ కోహ్లీకి కృతజ్ఞతలు తెలిపాడు. విరాట్ కోహ్లీ, మహ్మద్ సిరాజ్ మధ్య చాలా ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో మహ్మద్ సిరాజ్ ఆడాడు. అతడిలోని ప్రతిభను గుర్తించిన కోహ్లీ ప్రత్యేకంగా ప్రోత్సహించాడు. సిరాజ్‌ను వరల్డ్ క్లాస్ బౌలర్‌గా తీర్చిదిద్దడంలో విరాట్ కోహ్లీ పాత్ర కూడా ఉంది! ఈ నేపథ్యంలో వారి మధ్య స్నేహం చిగురించింది. అందుకే విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత.. అతడు లేని డ్రెస్సింగ్ రూమ్ అసంపూర్ణంగా ఉందని సిరాజ్ వాపోయాడు. ప్రస్తుతం ఈ పేసర్ ఇంట్లో ఉన్న కోహ్లీ జెర్సీ.. కేవలం ఓ జ్ఞాపకం మాత్రమే కాదు.. వారిద్దరి మధ్య ఉన్న అనుబంధానికి, స్నేహానికి గుర్తు అని క్రికెట్ అభిమానులు అంటున్నారు.







# బుమ్రా లేకున్నా మ్యాచ్‌లు గెలవడం గ్రేట్ : మైకెల్ క్లార్క్

తెందూల్కర్- అండర్సన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్‌తో టీమ్ఇండియా అయిదు టెస్ట్‌మ్యాచ్‌లు ఆడిన విషయం తెలిసిందే. వర్క్‌లోడ్ కారణంగా బుమ్రా కేవలం మూడు టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. అయితే బుమ్రా లేకున్నా టీమ్ఇండియా రెండు టెస్ట్ మ్యాచుల్లో గెలిచింది. ఇదంతా భారతజట్టు బౌలింగ్ దళం గొప్పదనమని ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైకెల్ క్లార్క్ అన్నాడు. బుమ్రా గైర్హాజరీలో మహ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో అద్భుతంగా రాణించాడు. ఈ సిరీస్‌లో ఏకంగా 23 వికెట్లు తీసుకున్నాడు. రెండు సార్లు అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అలాగే టీమ్ఇండియా ఈ టెస్ట్ సిరీస్‌ను 2-2తో సమం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. వర్క్‌లోడ్ నేపథ్యంలో బుమ్రా కేవలం మూడు మ్యాచ్‌లు ఆడటాన్ని కొందరు మాజీలు, క్రికెట్ అభిమానులు తప్పుబట్టారు. అయితే ఈ విషయంలో మైకెల్ క్లార్క్ బుమ్రాకు మద్దతుగా నిలిచాడు. అతడు లేకుండానే మ్యాచుల్లో గెలవడం నిజంగా అద్భుతమన్నాడు. బుమ్రా జట్టులో ఉంటే టీమ్ఇండియాకు అదనపు బలమని విశ్లేషించాడు. 'ఓవల్‌లో జరిగిన చివరి మ్యాచ్‌లో విజయం సాధించి టీమ్ఇండియా సిరీస్‌ను సమం చేసింది. ఇది నిజంగా అద్భుతం. ప్రపంచ మేటి బౌలర్‌గా పేరున్న బుమ్రా లేకుండానే టీమ్ఇండియా రెండు మ్యాచుల్లో విజయం సాధించింది. ఈ క్రెడిట్ అంతా భారత జట్టు బౌలింగ్ దళానికే చెందుతుంది' అని మైకెల్ క్లార్క్ ఓ పాడ్‌కాస్ట్‌లో అన్నాడు. 'బుమ్రా ఏ జట్టులో ఉంటే అది అత్యుత్తమం. ఇందులో భిన్నాభిప్రాయాలు లేవు. కానీ.. అతడు లేకుండానే రెండు మ్యాచ్‌లు గెలవడం అనేది మామూలు విషయం కాదు. మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ.. బుమ్రా లేని లోటును కనబడకుండా చేశారు. ముఖ్యంగా సిరాజ్.. ఎప్పుడైతే టీమ్ ఒత్తిడిలో ఉంటుందో.. అప్పుడు అద్భుతంగా రాణిస్తాడు. అతడు రెండో ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు' అని క్లార్క్ ప్రశంసించాడు.



# పెనాల్టీ పడినా.. వెనక్కి తగ్గొద్దన్న గంభీర్

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకోవాలంటే పాయింట్ల పట్టికలో టాప్-2లో ఉండాలి. అందుకోసం ప్రతి పాయింట్, పర్సంటేజీ అత్యంత కీలకం. స్లో ఓవర్ రేట్ కారణంగా కొన్నిసార్లు పాయింట్లను కోల్పోవాల్సిన పరిస్థితి ప్రతి జట్టుకూ ఎదురవుతుంది. అయితే, ప్రత్యర్థిపై విజయం కోసం అలాంటివాటిని పట్టించుకోవద్దని భారత్ ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తన టీమ్‌కు ఇచ్చిన సందేశం ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టు ఐదో రోజు ఐసీసీ నుంచి వచ్చిన వార్నింగ్‌పై గంభీర్ స్పందించిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. ఓవల్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆఖరి రోజున టీమ్ఇండియాకు 4 వికెట్లు అవసరం కాగా.. ఇంగ్లాండ్‌కు 35 పరుగులు మాత్రమే కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో అప్పటికే భారత జట్టు 6 ఓవర్లు వెనకబడి ఉంది. దానిని కవర్ చేయడం లేదా ఇంగ్లాండ్‌ను త్వరగా ఆలౌట్ చేయడమే గిల్‌సేన ముందున్న సవాళ్లు. లేకపోతే డబ్ల్యూటీసీలో పాయింట్లను కోల్పోయే ప్రమాదం ఉంది. భారత కోచింగ్ బృందంలోని ఓ సభ్యుడు మాత్రం 'స్పిన్నర్లతో కొన్ని ఓవర్లు వేయిస్తే బెటర్' అని సలహా ఇచ్చాడు. కానీ, స్లోఓవర్ పెనాల్టీ కంటే విజయం ముఖ్యమనే ఉద్దేశంతో గంభీర్ 'పేసర్లతోనే బౌలింగ్ చేయిద్దాం' అని సూచించాడు. సిరాజ్, ప్రసిద్ధ్ అద్భుతంగా బంతులేసి జట్టును గెలిపించారు. గంటలోపే నాలుగు వికెట్లను పడగొట్టడం విశేషం.

### ఆటగాళ్ల జెర్సీల వేలం

అండర్సన్ - తెందూల్కర్ ట్రోఫీలో ఆడిన భారత, ఇంగ్లాండ్ క్రికెటర్ల జెర్సీలను వేలం వేసి వచ్చిన నిధులను 'రెడ్ ఫర్ రూత్' ఛారిటీ కోసం కేటాయించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జెర్సీ రూ.5.40 లక్షలు, రవీంద్ర జడేజా రూ.4.94 లక్షలు, కేఎల్ రాహుల్ రూ.4.70 లక్షలు, జో రూట్ రూ.4.47 లక్షలు, బెన్ స్టోక్స్ రూ.4 లక్షలు వేలంలో అమ్ముడయ్యాయి. జో రూట్ టోపీకి రూ.3.52 లక్షలు, భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ క్యాప్‌నకు రూ.1.76 లక్షలు వచ్చాయి. ప్రతి సంవత్సరం లార్డ్స్ వేదికగా జరిగే ఒక టెస్టును మాజీ క్రికెటర్ ఆండ్రూ స్ట్రాస్‌కు చెందిన 'రెడ్ ఫర్ రూత్' ఫౌండేషన్‌కు అంకితం చేయడం ఆనవాయితీగా వస్తోంది.

# పంత్‌ది మాస్టర్‌మైండ్..

## నేనూ అలా ప్రయత్నించా : అఫ్గాన్ క్రికెటర్



రిషభ్ పంత్ మైదానంలో ఉంటే ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్. బ్యాటింగ్‌తోనే కాకుండా.. ప్రత్యర్థి ఆటగాళ్లను కవ్వించడంలోనూ నేర్పరి. అలాగే మ్యాచ్‌ను కాస్త 'డిలే' చేయాలంటే వెంటనే తన వ్యూహాలకు పదును పెట్టేస్తాడు. దిల్లీ క్యాపిటల్స్‌కు ఆడిన అఫ్గాన్ క్రికెటర్ గుల్బాదిన్ నైబ్ అయితే పంత్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. సమయం వృథా చేయడంలో తాను కూడా పంత్‌ను అనుసరించిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేసుకున్నాడు. టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో పంత్ 'మోకాలి' గాయంతో ఇబ్బందిపడగా.. అదే టోర్నీలో బంగ్లాతో పోరులో గుల్బాదిన్ 'సడెన్'గా మైదానంలో పడిపోవడం అభిమానులకు ఇప్పటికీ గుర్తుండిపోతుంది. ఆ మ్యాచ్‌లో అఫ్గాన్ విజయం సాధించడంతో.. ఆసీస్ కనీసం సెమీస్‌కు కూడా చేరుకోలేకపోయింది. "రిషభ్ పంత్ ఓ మాస్టర్ మైండ్ ప్లేయర్. అతడు అవలంబించే విధానం చాలా విభిన్నంగా ఉంటుంది. దిల్లీ క్యాపిటల్స్‌కు అతడితో కలిసి ఆడా. భారత క్రికెటర్లతో కలిసి ఆడటం, సినిమాలకు వెళ్లడం చేస్తే ఇలాంటి ఆలోచనలు (నవ్వుతూ) వస్తాయి. నేను ఫైనల్‌లో పంత్‌ను చూడగానే ఓకే .. అతడు సమయం వేస్ట్ చేస్తున్నాడని తెలిసిపోయింది. ప్రత్యర్థులు దూకుడుగా ఉండేటప్పుడు ఇలా చేయడం తప్పేమీ కాదు" అని నైబ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై టీమ్ఇండియా గెలిచి టైటిల్‌ను ఎగరేసుకుపోయిన సంగతి తెలిసిందే.

### కోచ్ నుంచి మాకు సిగ్నల్స్

"బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు వర్షం కారణంగా అంతరాయం కలిగింది. తొలుత మేం డక్‌వర్త్ పద్ధతి ప్రకారం బంగ్లా కంటే వెనకబడి ఉన్నాం. కాసేపటికే ముందుకొచ్చాం. దీంతో మా కోచ్ నుంచి సిగ్నల్ వచ్చింది. ఆ విషయం వికెట్ కీపర్ నజీబుల్లా జద్రాన్‌కు చెప్పా. కానీ, అతడు సరిగ్గా వినిపించుకోలేదు. నేను స్లిప్‌లో ఉన్నా. ఇక నేనే ఏదైనా చేయాలని అనుకున్నా. అయితే, ఇలా చేయడం కూడా టీమ్ఇండియాకూ కలిసొచ్చింది. అది జరిగిన తర్వాత మా కోచ్ నాతో రెండు రోజులు మాట్లాడలేదు. నావైపు చూసి నవ్వేసి వెళ్లిపోయేవాడు" అని నైబ్ తెలిపాడు.

# గిల్ జెర్సీకి 5.41 లక్షలు



**లండన్:** ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌లో అత్యధిక పరు గులు సాధించిన టీమ్ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. ఆ సిరీస్‌లో పోటీపడిన ఆటగాళ్లకు సంబంధించిన జెర్సీల వేలం లోనూ అగ్రస్థానంలో నిలిచాడు. అతడి జెర్సీ రూ.5 లక్ష ల 41 వేలకు అమ్ముడు-పోయింది. ఈ సిరీస్‌లో భారత్, ఇంగ్లాండ్ ఆటగాళ్లు ధరించిన జెర్సీలు, టోపీలను రెడ్‌రూత్ స్పెషల్ టైమ్డ్ వేలంలో గిల్ జెర్సీ అందరికంటే ఎక్కువ ధర పలకగా.. రవీంద్ర జడేజా, బుమ్రా జెర్సీలకు రూ.4.94 లక్షల చొప్పున లభించాయి. తర్వాత కేఎల్ రాహుల్ (రూ.4.70 లక్షలు) ఉన్నాడు. రిషబ్ పంత్ జెర్సీ రూ.4 లక్షలు పలికింది. ఇంగ్లాండ్ ప్లేయర్లలో జో రూట్ (రూ. 4.47 లక్షలు), బెన్ స్టోక్స్ (రూ.4 లక్షలు) జెర్సీలకు మంచి ధర దక్కింది. వేలం ద్వారా లభించిన మొత్తాన్ని రూత్‌స్ట్రాస్ ఫౌండేషన్‌కు అందజేస్తారు. 2-2తో డ్రాగా ముగిసిన 5 టెస్టుల సిరీస్‌లో శుభ్‌మన్ ఒక ద్విశతకం, 3 సెంచరీలతో 754 పరుగులు సాధించాడు.

# రిషబ్‌కు కాంస్యం




**చెంగ్డూ (చైనా):** వరల్డ్ గేమ్స్‌లో ఆర్చరీ కాంపౌండ్ విభాగంలో భారత్‌కు ఓ కాంస్య పతకం దక్కింది. పురుషుల సింగిల్స్ కంచు పోరులో పదో సీడ్ రిషబ్ యాదవ్ 149-147తో భారత్‌కే చెందిన అభిషేక్ వర్మను ఓడించాడు. అంతకుముందు సెమీఫైనల్లో రిషబ్ 145-147తో కర్టిస్ లీ (అమెరికా) చేతిలో ఓడగా.. అభిషేక్ 145-148తో మైక్ స్కోసెర్ (నెదర్లాండ్స్)కు తలొంచాడు. మహిళల్లో భారత్ కథ క్వార్టర్‌ఫైనల్లోనే ముగిసింది. పన్నెండో సీడ్ పర్ణీత్ కౌర్ 140-145తో అలెగ్జాండ్రా అజ్క్వియానో (కొలంబియా) చేతిలో పరాజయం చవిచూసింది. మధుర 145-149తో లిసెల్ జాట్మా (ఇస్తోనియా)కు తలొంచింది. మిక్స్‌డ్ విభాగంలో ఓటమి మరింత నిరాశపరిచింది. క్వాలిఫికేషన్లో అగ్రస్థానంలో నిలిచిన అభిషేక్ వర్మ-మధుర జోడీ.. ప్రధాన ఈవెంట్ తొలి రౌండ్లోనే ఇంటి ముఖం పట్టింది. అభిషేక్ ద్వయం 151-154తో మూన్ యాయున్-లీ ఇన్‌హెూ (దక్షిణ కొరియా) జోడీ చేతిలో ఓడింది.

# రాజస్థాన్ రాయల్స్ నా ప్రపంచం



**దిల్లీ:** రాజస్థాన్ రాయల్స్ జట్టును వీడబోతున్నట్లు ప్రచారం జరుగుతున్న సమయంలో ఆ జట్టు కెప్టెన్ సంజు శాంసన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రాయల్స్ ఫ్రాంఛైజీ, ఆ జట్టు చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ మీద ప్రశంసల జల్లు కురిపించాడు. మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌తో యూట్యూబ్ షోలో జరిగిన చర్చా కార్యక్రమంలో అతను రాయల్స్ ఫ్రాంఛైజీతో తన అనుబంధం గురించి మాట్లాడాడు. "రాజస్థాన్ రాయల్స్ నా ప్రపంచం. కేరళలోని ఒక పల్లెటూరి నుంచి వచ్చిన చిన్న కుర్రాడు తన ప్రతిభను చాటాలనుకున్నాడు. ఆ సమయంలో రాహుల్ ద్రవిడ్ సర్, మనోజ్ బదాలే (రాయల్స్ యజమాని) నాకొక వేదికను ఇచ్చి ప్రపంచానికి నువ్వేంటో చాటిచెప్పు అన్నారు. నాకు ఎప్పుడూ ఈ ఫ్రాంఛైజీ అండగా నిలిచింది. రాయల్స్‌తో నా ప్రయాణం ఎప్పుడూ గొప్పగా సాగింది. ఆ ఫ్రాంఛైజీకి ఎప్పటికీ రుణపడి ఉంటాను" అని సంజు తెలిపాడు. అయితే తాను రాయల్స్‌ను వీడుతున్నట్లు కానీ, ఆ జట్టుతోనే కొనసాగుతానని కానీ అతను వ్యాఖ్యానించలేదు.



# వాట్సప్ స్టేటస్‌లో మరో ఫీచర్

## ఫొటోలు ఎడిట్ చేయాల్సిన బాధ తప్పినట్లే

కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గడిపిన మధుర క్షణాల్ని చాలా మంది తమ వాట్సప్ స్టేటస్‌గా పెట్టుకుంటూ ఉంటారు. ఒకటి కంటే ఎక్కువ ఫొటోలు ఉన్న సందర్భంలో స్టేటస్‌ను ఒక్కోటిగా అప్‌డేట్ చేయాల్సిందే. ఒకవేళ నాలుగైదు ఫొటోలను కలిపి ఒకటే స్టేటస్‌గా పెట్టాలంటే మాత్రం వాటిని ఏదైనా థర్డ్ పార్టీ యాప్‌తో ఎడిట్ చేసి ఒకచోట చేర్చి ఆపై వాట్సప్ స్టేటస్‌గా పెట్టుకోవాల్సి వచ్చేది. ఇకపై ఆ ఇబ్బంది లేకుండా వాట్సప్ కొత్త సదు-పాయాన్ని తీసుకొచ్చింది. వాట్సప్‌లోనే కొలేజ్‌ను రూపొందించుకునే సదు-పాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. మన స్టేటస్‌కు ఇటీవల మ్యూజిక్‌ను యాడ్ చేసే సదుపాయాన్ని వాట్సప్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అదే తరహాలో ఒకటి కంటే ఎక్కువ ఫొటోలను స్టేటస్‌గా పెట్టుకునేందుకు బిల్ట్-ఇన్ ఎడిటర్‌ను తీసుకొచ్చింది. దీని సాయంతో ఒకేసారి ఆరు ఫొటోలను ఎంపిక చేసుకోవచ్చు. వాటిని మీకు నచ్చిన కొలేజ్‌గా రూపొందించొచ్చు. అంటే ముఖ్యమైన ఈవెంట్‌కు సంబంధించిన ఫొటోలన్నీ ఇన్‌స్టాగ్రామ్ తరహాలో సింగిల్‌గా స్టేటస్‌గా పెట్టుకోవచ్చన్నమాట. వాట్సప్ స్టేటస్‌లోకి వెళ్లి ఫొటోలు సెలక్ట్ చేసుకోగానే అక్కడ లేఔట్ అనే కొత్త ఆప్షన్ కనిపిస్తుంది. దాని ద్వారా మీకు నచ్చిన ఫొటోలను గ్యాలరీ నుంచి ఎంపిక చేసుకోవచ్చు. ఇప్పటికే కొందరికీ ఈ ఫీచర్ అందుబాటులోకి రాగా.. మిగిలిన వారికి త్వరలో రానుంది. దీంతో పాటు స్టేటస్‌లో మ్యూజిక్ స్టిక్కర్స్, ఫొటో స్టిక్కర్స్ వంటి సదుపాయాలు కూడా రాబోతున్నాయి.



# పండగల వేళ రైల్వే రిటర్న్ టికెట్‌పై 20% డిస్కౌంట్

పండగల సీజన్ మొదలైంది. సామాన్యులు ఊళ్లకు వెళ్లేందుకు రైలు ప్రయాణానికి ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. ఈక్రమంలో ఆహ్లాదకరమైన రైల్వే ప్రయాణాన్ని అందించేందుకు భారతీయ రైల్వే ప్రయాణికులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. 'రౌండ్ ట్రిప్ ప్యాకేజీ' పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో రిటర్న్ టికెట్ బుకింగ్‌పై 20 శాతం రాయితీ ఇవ్వనుంది. రైల్వేశాఖ ఈ మేరకు ఓ ప్రకటనలో పేర్కొంది. పండగ సమయాల్లో అప్పటికప్పుడు రద్దీని నివారించి ముందస్తు రిజర్వేషన్‌ను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇరువైపులా ప్రయాణికుల సంఖ్యను పెంచేందుకు ఇది దోహదపడుతుందని అభిప్రాయపడింది. రైల్లో ఊరెళ్లిన ప్రయాణికులు తిరుగు ప్రయాణంలోనూ టికెట్ బుక్ చేసుకున్నప్పుడే ఇది వర్తిస్తుందని అధికారులు తెలిపారు. బుకింగ్ సమయంలో ప్రయాణికులు ఇచ్చే వివరాల ఆధారంగా ఈ రాయితీ అందుతుంది. ఆగస్టు 14 నుంచి ఈ ఆఫర్ కింద టికెట్లు బుక్ చేసుకోవచ్చు. రాయితీ వర్తించే తేదీలనూ ప్రకటించింది. 2025 అక్టోబర్ 13 నుంచి 26 మధ్య ప్రయాణించేందుకు టికెట్ బుక్ చేసుకోవాలి. తిరుగు ప్రయాణం నవంబర్ 17 నుంచి డిసెంబరు 1 మధ్య ఉన్నప్పుడు ఈ పథకం కింద 20 శాతం రాయితీ వర్తిస్తుంది. అయితే, ఈ రిటర్న్ టికెట్ బుకింగ్‌కు ముందస్తు రిజర్వేషన్ పీరియడ్ (60 రోజులు) నియమం వర్తించదు. అలాగే, ఇరువైపులా బుక్ చేసుకున్న టికెట్‌లు కన్ఫర్మ్ అయినప్పుడు మాత్రమే ఆఫర్ వర్తిస్తుందని రైల్వే మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది.



# ఫిజికల్ సిమ్ - ఇ-సిమ్.. రెండింటికీ తేడా ఏమిటి?

సిమ్‌కార్డు.. మన ఫోన్‌లో ఉంటే కాల్స్ చేసుకోవచ్చు. అదే సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే కొందరి జీవితాలే మారిపోవచ్చు. మనచుట్టూ జరిగే చాలా వరకు సైబర్ నేరాలు దాదాపు దీనిచుట్టూనే అల్లుకుని ఉంటాయి. చూడ్డానికి చిన్నగా ఉన్నా.. అక్రమార్కుల చేతికి చిక్కితే తలరాతలే మారిపోతాయి. కాబట్టి వీటి వినియోగంలో అప్రమత్తత అవసరం. ఇప్పుడు మార్కెట్లో భౌతిక సిమ్‌కార్డులతో పాటు ఇ-సిమ్ కార్డులు కూడా అందుబాటులోకి వచ్చేశాయి. మరి ఫిజికల్ సిమ్‌కు ఇ-సిమ్‌కు మధ్య తేడా ఏమిటి? భద్రతాపరంగా ఏది సేఫ్?

### ఏమిటి తేడా?

సబ్‌స్క్రైబర్ ఐడెంటిటీ మాడ్యుల్.. సింపుల్‌గా సిమ్‌గా (%వా×వీ%) వ్యవహరిస్తారు. ఫోన్‌లో ఒకరితో ఒకరు సంభాషించడానికి ఈ చిప్‌తో కూడిన బుల్లి ప్లాస్టిక్ కార్డే ఆధారం. దీంట్లోనే నెట్‌వర్క్‌ను వినియోగించడానికి సంబంధించిన క్రెడెన్షియల్స్‌తో పాటు వ్యక్తుల వివరాలూ ఉంటాయి. ఫీచర్ ఫోన్ మొదలుకుని ఖరీదైన లక్షలు పోసి కొనే ఫోన్లలోనూ సిమ్‌కార్డు వేయాల్సిందే. అయితే, ప్రస్తుతం యాపిల్, గూగుల్ పిక్సెల్ తో పాటు కొన్ని ప్రీమియం డివైజుల్లో ఇ-సిమ్ సదుపాయం కూడా అందుబాటులోకి వచ్చింది. వీటిల్లో సిమ్ కార్డు వేయాల్సిన అవసరం లేదు. సింపుల్‌గా చెప్పాలంటే సిమ్‌కార్డుకు డిజిటల్ వెర్షన్ అని చెప్పాలి. దీన్ని స్మార్ట్‌ఫోన్‌తో పాటు స్మార్ట్‌వాచ్‌లు వంటి ఇతర డివైజుల్లోనూ వినియోగించొచ్చు.

### వినియోగంలో రెండూ రెండే..

మన నిత్యం వాడే ఫోన్ చేతిలోంచి జారి కింద పడి పాడైందనుకుందాం. అత్యవసరంగా ప్రయాణం చేయాల్సి వస్తే ఫిజికల్ సిమ్‌కార్డును వేరే స్మార్ట్‌ఫోన్‌లో వేసుకుని వినియోగించుకోవచ్చు. ఇ-సిమ్‌తో అలా సాధ్యం కాదు. ఒకవేళ మీరు ఒకటి కంటే ఎక్కువ సిమ్ కార్డులు వాడైతే లేదా తరచూ విదేశాలకు ప్రయాణం చేసేవారైతే ఒక నెట్‌వర్క్ నుంచి వేరే నెట్‌వర్క్‌కు మారడం ఇ-సిమ్ ద్వారా సులువు. ప్రతిసారీ సిమ్ కార్డు వేయాల్సిన అవసరం ఉండదు. ఇ-వేస్టేజ్‌ను తగ్గించొచ్చు.



# నిహారిక ఎమోషనల్ పోస్ట్



మెగా డాటర్ నిహారిక కొణిదెలకు ఇది రాఖీ పౌర్ణమి సమ్ థింగ్ స్పెషల్. ఎందుకంటే ఆమెకు ఇది డబుల్ ట్రీట్ ను అందించిన రోజు. పెదనాన్న మెగా స్టార్ చిరంజీవి కొడుకు రామ్ చరణ్‌తోనూ, సొంత అన్న వరుణ్ తేజ్ (తోనూ నిహారిక ఫోటోలను పెడుతూ తన మనసులోని మాటలను ఎమోషనల్ గా పోస్ట్ చేసింది. ఈ రాఖీ పండగ తనకు మరింత ప్రేమను అందిస్తోందని నిహారిక పేర్కొంది. తనకు ఎల్లప్పుడు అన్నయ్య చెర్రీ, వరుణ్ ఇద్దరూ వన్ స్టాప్ సొల్యూషన్స్ అని మనసులో మాట చెప్పింది. ఆ అన్నలిద్దరికీ చెల్లిగా అనిపించుకోవడం గ్రేట్ గా ఉంటుందని నిహారిక పేర్కొంది. ఇక ఈ రక్షాబంధన్ రోజునే నిహారిక మరో గుడ్ న్యూస్ ను గుర్తు చేసుకుంది. సరిగ్గా ఏడాది క్రితం ఆగస్ట్ 9వ తేదీనే నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' సినిమా జనం ముందుకు వచ్చింది. అందరూ కొత్తవాళ్ళతో ఆమె నిర్మించిన ఈ సినిమా కమర్షియల్ గా సక్సెస్ కావడమే కాకుండా అవార్డుల పంటనూ పండించింది. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన గద్దర్ అవార్డులలోనూ రెండింటిని ఈ సినిమా గెలుచుకుంది. ఉత్తమ జాతీయ సమైక్యత, మత సామరస్యం, సామాజిక అభ్యున్నతి చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అలానే ఉత్తమ నూతన చిత్ర దర్శకుడిగా యదువంశీ గద్దర్ అవార్డు ను అందుకున్నారు. రివార్డులు, అవార్డులు తన చిత్రానికి దక్కడంతో నిహానిక వెంటనే మరో సినిమాకు శ్రీకారం చుట్టింది.

## చాన్సుల కోసం అందాల ఆరబోత

ఉప్పెన సినిమాతో మెగాస్టార్ మనసు దోచిన ఈ బ్యూటీ.. చిరు ఆన్ స్టేజ్ చెప్పినట్టు.. ఇండస్ట్రీలో ఎక్కడికో వెళ్లిపోతుందని అందరూ అనుకున్నారు. కానీ చివరికి ఎక్కడికీ పోకుండా సినిమా అవకాశాలే లేకుండా.. మిగిలిపోయారు. వరుస ఫ్లాప్‌లతో సతమతమవుతూ.. మేకర్స్ వైపు అవకాశం కోసం ఆశగా చూసే వరకు పరిస్థితి తెచ్చుకున్నారు. అయితే ఇలాంటి ఈ సిట్యువేషన్‌లో.. కృతి షెట్టి ఓ ఫోటో షూట్‌తో కాస్త బోల్డ్ గా కనిపించారు. తాను హద్దులు దాటేందుకు రెడీ అన్నట్టుగా మేకర్స్ కు హింట్ ఇచ్చారు. ఆ ఫోటోలతో నెట్టింట కూడా తెగ వైరల్ అవుతున్నారు. కానీ అవే ఫోటోలతో మేకర్స్ మైండ్‌లో రిజిస్టర్ అయ్యారా? లేదా అనేది ఇక్కడ పాయింట్. పాన్ ఇండియా సినిమాలు.. మార్కెట్ అంచనాలు.. ప్రేక్షకుల నాడీని పట్టుకోడాలు.. ఓ సినిమా తెరకెక్కించేందుకు.. ఆ సినిమాలో ఆర్టిస్టులను క్యాస్ట్ చేసేందుకు... ఇలాంటి అంశాలనుపట్టుకునే మేకర్స్ ఇప్పుడు ఈమె బోల్డ్ ఫోటోలను చూసి ఛాన్స్ ఇస్తారా? లేక టూ లేట్ అంటూ.. లైట్ తీసుకుంటారా? అనేది ఇక్కడ పాయింట్. అయితే మేకర్స్ పాయింట్ ఆఫ్ వ్యూను పక్కక పెడితే.. ఇప్పుడు అందాలు ఆరబోసి ఏం లాభం అనేది నెటిజన్స్ కామెంట్. ప్రస్తుతం సోషల్ మీడియా ఖాతాలలో గ్లామర్ ఫోజులతో మెంటలెక్కిస్తోంది ఈ వయ్యారి. ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ చూసి షాకవుతున్నారు నెటిజన్స్. ప్రస్తుతం కృతికి తెలుగులో ఒక్క సినిమా ఛాన్స్ రావడం లేదు. కానీ తమిళం, మలయాళంలో మాత్రమే ఈ అమ్మడు అవకాశాలు అందుకుంటూ ఫుల్ బిజీగా ఉంటుంది. మరోవైపు నెట్టింట గ్లామర్ ఫోటోలతో రచ్చ చేస్తుంది.

## జోడీ కుదిరిందా?




పూజా హెగ్డే ప్రస్తుతం తమిళంలో వరుస సినిమాలతో జోరు చూపిస్తున్నప్పటికీ తెలుగు నుంచి ఇంకా కొత్త కబురేదీ వినిపించలేదు. దుల్కర్ సల్మాన్ - రవి నేలకుదిటి కలయికలో రూపొందుతున్న చిత్రంలో నాయికగా కనిపించనున్నట్లు తెలుస్తున్నా.. అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే ఇప్పుడు పూజ పేరు మరో తెలుగు సినిమా విషయంలోనూ బలంగా వినిపిస్తోంది. నితిన్ కథానాయకుడిగా విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. ఇందులో కథానాయికగా పూజా హెగ్డే పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై ఆమెతో సంప్రదింపులు మొదలైనట్లు తెలిసింది. క్రీడా నేపథ్య కథాంశంతో రూపొందనున్న ఈ సినిమాలో నితిన్ హార్స్ రైడర్‌గా కనువిందు చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికోసం గుర్రపు స్వారీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రానికి 'స్వారీ' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఏడాది చివర్లో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది.

## నీకే ట్యాగ్ అయ్యానే మలయాళీ పిల్లా

"ఇన్‌స్టా ఆపేశానే.. ట్విటర్ మానేశానే.. నీకే ట్యాగ్ అయ్యానే మలయాళీ పిల్లా" అంటూ తన మనసు దోచిన మలయాళ సోయగం కోసం ప్రేమ గీతాలు ఆలపిస్తున్నారు కిరణ్ అబ్బవరం. ఇప్పుడాయన.. యుక్తి తరేజా జంటగా నటిస్తున్న చిత్రం 'కె-ర్యాంప్'. జైన్స్ నాని తెరకెక్కిస్తున్న ఈ సినిమాని రాజేశ్ దండా, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం దీపావళి సందర్భంగా అక్టోబరు 18న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ సినిమా నుంచి "ఓనమ్" గీతాన్ని విడుదల చేశారు. దీనికి చేతన్ భరద్వాజ్ స్వరాలు సమకూర్చడమే గాక సాహితీ చాగంటితో కలిసి స్వయంగా ఆలపించారు. సురేంద్ర కృష్ణ సాహిత్యమందించారు. ఈ పాటలో కిరణ్ - యుక్తిల కెమిస్ట్రీ, వాళ్లిద్దరు వేసిన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమాకి కూర్పు: ఛోటా కె ప్రసాద్, ఛాయాగ్రహణం: సతీశ్ రెడ్డి మాసం.



## సల్మాన్‌తో కలిసి నటిస్తే చంపేస్తాం : బిష్ణోయ్‌గ్యాంగ్



ప్రముఖ హిందీ హాస్య నటుడు కపిల్ శర్మ కెఫెపై దుండగులు మరోసారి కాల్పులు తెగబడిన విషయం తెలిసిందే. కెనడాలోని ఆయన నడుపుతున్న కప్స్ కెఫెపై గురువారం కొందరు తుపాకులతో కాల్పులు జరిపారు. కారులో వచ్చి.. కెఫెకు సమీపంగా వెళ్తూ దాడికి పాల్పడిన వీడియో నెట్టింట వైరలవుతోంది. నెల రోజుల వ్యవధిలోనే ఇది రెండో కాల్పుల ఘటన. ఇది తమ పనే అని గ్యాంగ్‌స్టర్ గోల్డీ ధిల్లాన్ ఆన్‌లైన్ పోస్ట్ ద్వారా వెల్లడించాడు. బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో ఉన్న సాన్నిహిత్యం కారణంగానే హాస్యనటుడిని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఆడియో ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. లారెన్స్ బిష్ణోయ్ గ్రూప్‌నకు చెందిన హ్యారీ బాక్సర్ అనే వ్యక్తి ఈ ఆడియోను రికార్డ్ చేశాడు. 'కపిల్ శర్మకు చెందిన రెస్టారంట్‌లో ఇటీవల, ఇప్పుడు కాల్పులు జరిగాయి. నెట్‌ఫ్లిక్స్ షోకి సల్మాన్‌ఖాన్‌ను ఆహ్వానించడమే అందుకు కారణం' అని ఆడియోలో పేర్కొన్నాడు. సల్మాన్‌ఖాన్‌తో పనిచేసే దర్శకుడు, నిర్మాత, నటులను చంపేస్తానంటూ అతడు హెచ్చరికలు చేశాడు. 'సల్మాన్‌తో కలిసి ఎవరైనా పనిచేస్తే.. అది చిన్న నటుడైనా, చిన్న దర్శకుడైనా సరే మేము ఎవరినీ వదిలిపెట్టము. చంపేస్తాం. వారిని చంపడానికి ఎంతకైనా తెగిస్తాము' అని అందులో బెదిరించాడు. జూలై నెలలో కెనడాలో కపిల్ కప్స్ కెఫెను ప్రారంభించారు. కెఫెన్ తెరిచిన కొన్నిరోజులకే సిబ్బంది లోపల ఉండగానే ఉదయం 1:50 సమయంలో పలుమార్లు కాల్పులు జరిపారు దుండగులు. కెఫె కిటికీలపై పది బుల్లెట్ రంధ్రాలు ఏర్పడ్డాయి. అయితే.. అదృష్టవశాత్తూ ఆ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదు. 'ది కపిల్ శర్మ షో'తో పాపులర్ అయిన కపిల్ హీరోగాను వెండితెరపై మెరిశాడు. క్రూ, ఫిరంగీ, ట్యూబ్‌లైట్, కిస్ కిస్కో ప్యార్‌కరూన్ వంటి బాలీవుడ్ చిత్రాల్లో నటించాడీ కామెడీ కింగ్.





## మాస్ రవితేజ టీజర్ వచ్చేసింది..

మాస్ మహారాజ కథానాయకుడు రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. శ్రీలీల కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగష్టు 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ మొదలుపెట్టింది చిత్రయూనిట్. నేడు రాఖీ పండుగా సందర్భంగా మూవీ నుంచి టీజర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ మూవీ టీజర్‌ను ఆగష్టు 11న ఉదయం 11.08 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.

## కాంతార టీమ్‌ను వెంటాడుతున్న విషాదాలు

రిషబ్ శెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న 'కాంతార చాప్టర్?1' సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటినుంచే టీమ్‌ను అనేక ప్రమాదాలు, విషాద సంఘటనలు కలవరపెడుతున్నాయి. తాజాగా, ప్రముఖ కన్నడ నటుడు టి. ప్రభాకర్ కళ్యాణి గుండెపోటుతో మరణించారు. ఉడిపిలోని హిరియడ్కలోని తన నివాసంలో ఆయన కుప్పకూలి చనిపోయారు. ఆయనకు గుండెకి సంబంధించిన చికిత్స జరిగినట్టు సమాచారం. కొద్ది రోజుల క్రితం ఆయన కళ్లు తిరిగి పడిపోవడంతో ఆసపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. చికిత్స తర్వాత బాగానే ఉన్నా, హఠాత్తుగా గుండెపోటు రావడంతో కన్నుమూసారు.గత కొద్ది రోజులుగా కాంతార ఛాప్టర్ 1మూవీకి సంబంధించిన ఎవరో ఒకరు ఇలా కన్నుమూస్తుండడం ఆందోళన కలిగిస్తుంది. కాంతార చాప్టర్ 1 సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటి నుంచీ వరుసగా ప్రమాదాలు, విషాద సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. గత నవంబర్‌లో జూనియర్ ఆర్టిస్టులను తీసుకెళ్తున్న వ్యాన్‌కి ప్రమాదం జరగడంతో చాలా మందికి గాయాలు అయ్యాయి.ఆ తర్వాత మళయాళీ



జూనియర్ ఆర్టిస్ట్ కపిల్ (33) నదిలో మునిగి చనిపోవడం, హాస్యనటుడు రాకేష్ పూజారి (33) గుండెపోటుతో మరణించడం వంటి సంఘటనలు చిత్ర బృందాన్ని కలవరపరిచాయి. ఇటీవల కళాభవన్ నిజూ కూడా గుండెపోటుతో మరణించినట్టు శాండల్ వుడ్ వర్గాలు తెలిపాయి. మరోవైపు కర్ణాటక రాష్ట్రం శివమొగా జిల్లా మణి జలాశయంలో షూటింగ్ జరుగుతున్న సమయంలో బోటు తిరగబడి నటుడు-దర్శకుడు రిషబ్ శెట్టితో పాటు 30 మంది నీటిలో పడిపోయినట్టు ఇటీవల వార్తలు చ్చాయి. అయితే, హొంబాలే ఫిలింస్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆదర్శ ఈ వార్తల ను ఖండిస్తూ.. గాలి వాన వల్ల సెట్ కూలింది తప్ప ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు అని ఆయన తెలియజేశారు. గతంలో కూడా గాలి వాన వలన కాంతార టీమ్ వేసిన భారీ సెట్ కుప్ప కూలింది. ఆ సమయంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే మూవీ రిలీజ్‌కి దగ్గర పడుతున్న సమయంలో ఇలాంటి ఘటనలు టీమ్‌ని టెన్షన్‌కి గురి చేస్తుంది. ఈ సినిమాకోసం హీరో కమ్ డైరెక్టర్ రిషబ్ శెట్టి చాలా హార్డ్ వర్క్ చేశాడు. ప్రత్యేకమైన యుద్ధ కళను కూడా నేర్చుకున్నాడు, భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా రేంజ్ లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 2 విడుదల చేయబోతున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com